ప్రజాశక్తి
శుక్రవారం 22 సెప్టెంబర్ 2023 8 పేజీలు



గుంటూరు



పల్నాడు

కష్టాల పంట-నష్టాల గాయం

- రైతులకు భారీగా పతనమైన కూరగాయల ధరలు
- కిలో టమాట రూ.5, బెండ రూ.6, దొండ రూ.3
- కోత కూలి ఖర్చులు కూడా రావని దున్నేసే యోచన



ప్రజాశక్తి - పల్నాడు జిల్లా

ధరలు లేక తాము ఆర్థికంగా నష్ట పోతున్నా రైతులు తమ ఉదారతను చాటుకుంటున్నారు. కూరగాయలు ధరలు పడిపోయి కోత కూలి కూడా రాని పరిస్థితుల్లో వాటిని ఉచితంగానే కోసుకెళ్లాలని దారిన పోయే వారిని చెబుతున్నారు.

ఇటీవల కొంతకాలం కూరగాయలు ధరలు ఆశాజనకంగా ఉన్నా నెల రోజులుగా ధరలు పతనమవుతున్నాయి. వ్యాపారులు సిండికేట్‌గా మారి తక్కువ ధరలను నిర్ణయించి రైతులేను దోచుకుంటున్నారు. సాధారణంగా ప్రతి ఏడాది ఏప్రిల్, మే నెలల్లో కూరగాయల ధరలు పెరుగుతాయి. అయితే తొలకరి వర్షాలతో అన్ని ప్రాంతాల్లో కూరగాయలు ఎగుమతులు, దిగుమతులతో తగ్గుముఖం పడతాయి. జూలై, ఆగస్టు నెల నాటికి కూరగాయల ధరలు సాధారణ స్థాయికి చేరుతాయి. అయితే

▶ 2లో

ధర తక్కువంటే పంట కొనరు



రెండెకరాలు కౌలుకు తీసుకున్నాను. ఎకరాకు రూ.15 వేలు చొప్పున ముందుగానే కౌలుచెల్లించి దొండ, బెండ, వంగ తోటలు సాగు చేశాను. పంటను మార్కెట్‌లో వ్యాపారుల వద్దకు తీసుకెళ్తే 50 కిలోల దొండకాయలు రూ.150/-200కు, వంకాయలు రూ.250కు, బెండకాయలు రూ.300-350కు కొంటున్నారు. ఇంత తక్కువెందుకని అడిగితే అసలు కొనరు. ఈ ధరలతో కోత కూలి ఖర్చులు కూడా రావడం లేదు. ఇంకా రెండు నెలలపాటు బెండ పంట వచ్చే అవకాశం ఉన్నా దాన్ని దున్నేసి వేరే పంట వేద్దామని నిర్ణయించుకున్నా.

చప్పిడి లక్ష్మయ్య, ఉప్పలపాడు.

మాకు రూ.6.. జనాలకు రూ.30



కిలో బెండ విత్తనాలను రూ.4 వేలకు కొని 80 సెంట్లలో 4 కిలోల విత్తనాలు నాటాం. ఎరువులు, పురుగు మందులు, కూలీల ఖర్చులకు రూ.60 వేలు వరకు పెట్టుబడులు అయ్యాయి. తీరా పంట చేతికొచ్చే నాటికి కిలో రూ.6కు మించి దక్కడం లేదు. బయట మార్కెట్లో మాత్రం జనాలకు రూ.30-50 వరకూ అమ్ముతున్నారు.

సుశీల, ఉప్పలపాడు

ప్రభుత్వమే చర్యలు తీసుకోవాలి



రైతు కష్టాన్ని, నష్టాన్ని ప్రభుత్వం గుర్తించాలి. రైతు భరోసా కేంద్రాల ద్వారా కూరగాయల సాగు చేస్తున్న రైతులను గుర్తించి ధరల స్థిరీకరణ నిధి ద్వారా ఆదుకోవాలి. దళారీ వ్యవస్థ నియంత్రించాలి. రైతు బజారు ఏర్పాటు చేసి రైతుకు కనీస మద్దతు ధర దక్కేలా చూడాలి.

ఏపూరి గోపాలరావు, రైతు సంఘం, పల్నాడు జిల్లా కార్యదర్శి.

నిమజ్జనంలో ప్రమాదం

తండ్రీకొడుకులు దుర్మరణం

ప్రజాశక్తి-పిడుగురాళ్ల



మృతులు నీరుమళ్ల శ్రీనివాసరావు, వెంకటేశ్

వినాయక విగ్రహ నిమజ్జనంలో అపశృతి తలెత్తి తండ్రీ కొడుకులు దుర్మరణం పాలయ్యారు. మాచవరం మండలం గోవిందపురం కృష్ణానది వద్ద బుధవారం అర్ధరాత్రి జరిగిన ఘటనపై మాచవరం ఎస్ఐ సమీర్‌బాష వివరాల ప్రకారం.. పిడుగురాళ్ల పట్టణంలోని 15వ వార్డు వికాస్ పబ్లిక్‌స్కూల్ ప్రాంతంలో వినాయక విగ్రహాన్ని ఏర్పాటు చేయగా దాని నిమజ్జనం కోసం మాచవరం మండలం గోవిందపురంలోని కృష్ణా నదికి బుధవారం రాత్రి 9.30 గంటల తర్వాత బయలుదేరారు. నది వద్దకు చేరుకునే సరికి దాదాపు 11 గంటలైంది. విగ్రహాన్ని నిమజ్జనం చేసేందుకు అందరూ కలిసి మోసుకెళ్తుంగా నీరుమళ్ల శ్రీనివాసరావు (53), కుమారుడు వెంకటేశ్ (29), మరో ఇద్దరు నీటిలో గల్లంతయ్యారు. ఇది గమనించిన మిగతావారు కాపాడే ప్రయత్నం చేశారు. ఇద్దర్ని కాపాడినా శ్రీనివాసరావు, వెంకటేశ్ మాత్రం కనిపించలేదు. సమాచారం తెలుసుకున్న మాచవరం పోలీసులు అక్కడికి చేరుకున్నారు. గజ ఈతగాళ్ల సాయంతో రాత్రి నుంచి గాలించారు. గురువారం ఉదయం వీరిద్దరి మృతదేహాలు ఘటనా స్థలికి కొద్దిదూరంలో దొరికాయి. మృతదేహాను పోస్టుమార్టం నిమిత్తం గురజాల ప్రభుత్వాస్పత్రికి తరలించిన పోలీసులు కేసు నమోదు చేశారు. మృతుల్లో శ్రీనివాసరావు కూలి పనులు చేస్తుండగా, వెంకటేశ్ పిడుగురాళ్ల పట్టణంలోనే ఎంబ్రాయిడరీ వర్క్ చేస్తుంటాడు. వెంకటేశ్‌కు తల్లి, తమ్ముడు, భార్య, కుమారుడు ఉన్నారు.



చేనేత జౌళి శాఖ కమిషనర్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న ఐక్య కార్యాచరణ కమిటీ

పాలక మండళ్లు లేక పనులు కరువు

- ఐదేళ్లుగా ఎన్నికల్లేని చేనేత సహకార సంఘాలు
- నిధులు డ్రా చేసే వీల్లేక రోజువారీ కార్యక్రమాలూ కుంటు
- చేనేత జౌళి శాఖ కమిషనర్ కార్యాలయం వద్ద ఐక్యకార్యాచరణ కమిటీ ధర్నా
- ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ - కమిషనర్‌కు వినతి

2 లో

జిపిఎస్‌పై నేటి నుండి ఫ్యాప్టో నిరసనలు

25న కలెక్టరేట్ల ముట్టడి

ప్రజాశక్తి-గుంటూరు

సిపిఎస్ ఉద్యోగులకు ఇచ్చిన హామీని విస్మరించి, జిపిఎస్ విధానాన్ని అసెంబ్లీలో ప్రవేశపెట్టాలనే నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ రేపటి నుండి మూడ్రోజులపాటు ఆందోళనలకు పిలుపునిచ్చినట్లు ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య (ఫ్యాప్టో) జిల్లా చైర్మన్ ఎం.కళాధర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 22న నల్లబ్యాడ్జీలతో విధులకు హాజరు కావాలని, 23న సాయంత్రం తాలూకా కేంద్రాల్లో నిరసన ప్రదర్శనలు, 25న చలో కలెక్టరేట్ నిర్వహించాలని ఫ్యాప్టో నిర్ణయించినట్లు పేర్కొన్నారు. ఉపాధ్యాయులు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రభుత్వానికి తమనిరసన తెలపాలని పిలుపునిచ్చారు. అధికారంలోకి వచ్చిన వారం రోజుల్లో సిపిఎస్ రద్దు చేస్తామని హామి ఇచ్చి నాలుగేళ్ల అధికారం తర్వాత ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలు వ్యతిరేకిస్తున్నా జిపిఎస్ అనే

▶ 2లో



సమావేశంలో మాట్లాడుతున్న శివనాగరాణి

కోనేరు రంగారావు కమిటీ సిఫార్సులను అమలు చేయాలి

రౌండ్‌టేబుల్ సమావేశంలో ప్రజా సంఘాల డిమాండ్

ప్రజాశక్తి-తాడేపల్లి

రాష్ట్ర ప్రభుత్వానికి ఎస్సీ, ఎస్టీల పట్ల చిత్తశుద్ధి ఉంటే కోనేరు రంగారావు సిఫార్సులను అమలు చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర మహిళా కన్వీనర్ వి.శివనాగరాణి డిమాండ్ చేశారు. వ్యవసాయ కార్మిక సంఘం, కెవిపిఎస్, సిఐటియు, గిరిజన సంఘం ఆధ్వర్యంలో గురువారం ప్రకాష్‌నగర్‌లోని సిఐటియు కార్యాలయంలో రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. సమావేశానికి గిరిజన సంఘం నాయకులు కె.వెంకటయ్య అధ్యక్షత వహించారు. నాయకలు మాట్లాడుతూ ఎస్‌సి, ఎస్‌టి సబ్‌ప్లాన్ చట్టం ప్రకారం బడ్జెలో పక్కదారి పట్టించిన నిధులను తిరిగి వారికే కేటాయించాలని కోరారు. 45 ఏళ్ల దాటిన డప్పు కళాకారులు, చర్మకారులకు పెన్షన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. అర్హులైన ప్రతి దళిత కుటుంబానికి 3 సెంట్ల ఇంటి స్థలం, రెండెకరాలు సాగు భూమి, పక్కా గృహానికి రూ.5 లక్షలు

▶ 2లో


నర్సరీని పరిశీలిస్తున్న ఉద్యాన శాఖాధికారి మోహన్

తోటల సాగుకు రాయితీలు

ప్రజాశక్తి - రెంటచింతల

పండ్లు, పూల తోటల సాగుకు ఉద్యానశాఖ రాయితీలు ఇస్తున్నట్లు గురజాల ఉద్యాన శాఖాధికారి మోహన్ తెలిపారు. రెంటచింతల మండలంలోని పలు నర్సరీలను గురువారం పరిశీలించిన ఆయన మాట్లాడుతూ మామిడి తోట సాగుకు హెక్టారుకు (రెండున్నర ఎకరాలు) రూ.7980, జామకు రూ.17,599, కోకో, జీడి మామిడికి రూ.12 వేలు, డ్రాగన్ ఫ్రూట్స్ రూ.30 వేలు చొప్పున రాయితీ ఇస్తున్నట్లు వివరించారు. పూల తోటలకు హెక్టారుకు రూ.16 వేల రాయితీ ఉంటుందన్నారు. ఆసక్తి ఉన్న రైతులు పూర్తి వివరాల కోసం రైతు భరోసా కేంద్రాల్లో సంప్రదించాలని సూచించారు.

వెబ్ ల్యాండ్ ఉద్యోగిగా మౌనిక

ప్రజాశక్తి - రెంటచింతల

మండల కేంద్రమైన రెంటచింతలలోని తహశీల్దార్ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా మౌనికను నియమిస్తూ పల్నాడు జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్ ఉత్తర్వులు జారీ చేసినట్లు తహశీల్దార్ పుల్లారావు తెలిపారు. గ్రూప్ -4 ద్వారా తొలి ఉద్యోగం పొందిన మౌనిక వెబ్ ల్యాండ్, మీ-సేవ, ఆన్‌లైన్ సర్వీసు విధులను నిర్వహిస్తారని తెలిపారు.

కోనేరు రంగారావు కమిటీ సిఫార్సులను అమలు చేయాలి

(మొదటి పేజీ తరువాయి)

కేటాయించాలని కోరారు. భూస్వాములకు అనుకూలంగా తెచ్చిన అసైన్డ్ చట్టాన్ని ఉపసంహరించుకోవాలన్నారు. రాయలసీమ జిల్లాల్లో శ్మశానాల్లో పని చేస్తున్న కార్మికులను నాల్గో తరగతి ఉద్యోగులుగా గుర్తించాలన్నారు. జస్టిస్ పున్నయ్య కమిషన్ సిఫార్సులను అమలు చేయాలని, ఉచిత విద్యుత్‌ను 300 యూనిట్లకు పెంచాలని కోరారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం మనువాద రాజ్యాంగం అమలుకు చేస్తున్న కుట్రలను తిప్పికొట్టాలన్నారు. రాజ్యాంగాన్ని కాపాడుకోవడానికి దళిత, గిరిజనులు కదలిరావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో వ్యవసాయ కార్మిక సంఘం గుంటూరు జిల్లా కార్యదర్శి ఇ.అప్పారావు, వివిధ ప్రజా సంఘాల నాయకులు బి.వెంకటేశ్వర్లు, కె.కరుణాకరరావు, వి.దుర్గారావు, ఇ.శాస్త్రి, ఎన్.దుర్గారావు, ఎం.చినచెన్నయ్య, టి.వెంకటయ్య పాల్గొన్నారు.

జిపిఎస్‌పై నేటి నుండి ఫ్యాప్టో నిరసనలు

(మొదటి పేజీ తరువాయి)

కొత్త విధానాన్ని బలవంతంగా అమలు చేయాలని చూస్తోందని విమర్శించారు. ఇది సిపిఎస్ ఉద్యోగుల్ని మోసం చేయటమేనని, జిపిఎస్ ముసాయిదా బిల్లును తక్షణమే ఉపసంహరించుకొని, ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం సిపిఎస్ రద్దు చేసి, ఒపిఎస్‌ను అమలు చేయకుంటే పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.

రేపు నియోజకవర్గ స్థాయి క్రీడలు

ప్రజాశక్తి - నాదెండ్ల: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో చిలకలూరిపేట నియోజకవర్గస్థాయి క్రీడా పోటీలు బాల, బాలికలకు అండర్-14, అండర్-17 విభాగాల్లో మండలంలోని సాతులూరులో శనివారం నిర్వహిస్తామని పిఇటి అంజమ్మ గురువారం తెలిపారు. స్థాయిలో ఎంపికైన క్రీడాకారులు తమ ఎంట్రీ ఫార్మ్స్‌తో పాటు హాజరవ్వాలని, క్రీడాకారులకు మధ్యాహ్న భోజన వసతి కల్పిస్తామని తెలిపారు.

పాలక మండళ్లు లేక పనులు కరువు

- ఐదేళ్లుగా ఎన్నికల్లేని చేనేత సహకార సంఘాలు
- నిధులు డ్రా చేసే వీల్లేక రోజువారీ కార్యక్రమాలూ కుంటు
- చేనేత జౌళి శాఖ కమిషనర్ కార్యాలయం వద్ద ఐక్యకార్యాచరణ కమిటీ ధర్నా
- ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ - కమిషనర్‌కు వినతి


చేనేత జౌళి శాఖ కమిషనర్ ఎంఎం నాయక్‌కు వినతి పత్రం ఇస్తున్న నాయకులు

ప్రజాశక్తి - మంగళగిరి

చేనేత సహకార సంఘాల పాలక మండళ్లకు ఐదేళ్ల నుండి ఎన్నికలు నిర్వహించటం లేదని, నామినేటెడ్ బోర్డులు గాని ప్రత్యేకాధికారిగానీ లేకపోవడంతో సంఘాల్లో రోజువారీ కార్యక్రమాలు కుంటుపడి చేనేత కార్మికులు పనుల్లేక పస్తులుంటున్నారని చేనేత ఐక్య కార్యాచరణ కమిటీ ఆవేదన వెలిబుచ్చింది. కమిటీ ఆధ్వర్యంలో స్థానిక చేనేత జౌళి శాఖ కమిషనర్ కార్యాలయం వద్ద గురువారం ధర్నా చేసి చేనేత జౌళి శాఖ కమిషనర్ ఎంఎం నాయక్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ వ్యవసాయం తర్వాత అతిపెద్ద రంగమైన చేనేతను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విస్మరిస్తున్నాయని అన్నారు. గత టిడిపి ప్రభుత్వం ఏడాదిపాటు చేనేత సహకార సంఘాల పాలకవర్గాల పదవీకాలాన్ని పొడిగించిందని, 2019 ఫిబ్రవరి 11న అప్పటి సిఎం చంద్రబాబునాయుడు టిడిపి నాయకులతో ఆరు నెలలపాటు నామినేటెడ్ బోర్డులు ఏర్పాటు చేశారని, అదే ఏడాది జూన్‌లో అధికారంలోకి వచ్చిన వైసిపి ప్రభుత్వం 2019 జులై 7న వైసిపి నాయకులతో ఐదుగురు సభ్యుల నామినేట్ బోర్డులు వేసిందని తెలిపారు. అప్పటి నుండి నాలుగేళ్లలో 8 సార్లు నామినేటెడ్ బోర్డులను పొడిగించుకుంటూ వచ్చారని, ఈ ఏడాది జులై ఆరో తేదీన ఆ బోర్డుల పదవీకాలం పూర్తి కావడంతో ఏడవ తేదీ నుండి చేనేత సహకార సంఘాలకు అధ్యక్షులు, పాలకవర్గ సభ్యులు ఎవరూ లేరని చెప్పారు. దీనివల్ల బ్యాంకుల నుండి డబ్బు డ్రా చేసేందుకు వీల్లేకపోవడంతో రోజువారీ కార్యక్రమాలు కుంటుపడి సహకార సంఘాలు చేనేత కార్మికులకు పని చూపలేని పరిస్థితి నెలకొందన్నారు. చేనేత పరిశ్రమ సంక్షోభంలో ఉండగా కొద్దిపాటి మంది కార్మికులైన పని చూపుతున్న చేనేత సహకార సంఘాలు మూతపడటంతో చేనేత కార్మికుల ఆందోళన చెందుతున్నారని, చేనేత సహకార సంఘాలకు వెంటనే ఎన్నికలు నిర్వహించి కార్మికులకు పని చూపించాలని, అప్పటివరకు సంఘాలకు ప్రత్యేకాధికారులను నియమించాలని డిమాండ్ చేశారు. ఈ అంశాలపై ప్రభుత్వాలు స్పందించకుంటే ఆందోళనను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.బాలకృష్ణ, చేనేత ఐక్య కార్యచరణ కమిటీ నాయకులు ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు పి.నాగేశ్వరరావు, ఆర్.పూర్ణచంద్రరావు, ఎం.సత్యనారాయణ, జి.బాలాజీ, బి.రామారావు, కె.మోహన్‌రావు, టి.సత్యనారాయణ, టి.రామసుబ్బారావు, రామకృష్ణ, కె.వెంకటేశ్వరరావు, బి.మోహన్‌రావు, బి.గిరి, జి.వెంకటకృష్ణ, డి.ఈశ్వరరావు, బి.బాల, డి.సత్యనారాయణ పాల్గొన్నారు.

ప్రశాంతంగా ఎస్సై దేహదారుఢ్య పరీక్షలు

ప్రజాశక్తి - గుంటూరు సిటి



పోలీసు నియామక ప్రక్రియలో భాగంగా గుంటూరు రేంజ్ పరిధిలో ఎస్సై ఉద్యోగాల ప్రాథమిక రాత పరీక్షలో అర్హత సాధించిన అభ్యర్థులకు గుంటూరు పెరేడ్ గ్రౌండ్స్‌లో దేహదారుఢ్య పరీక్షలు బుధవారం ప్రశాంత వాతావరణ కొనసాగాయి. పరీక్షలను గుంటూరు రేంజ్ ఐ.జి పాల్‌రాజుతో పాటు అడిషనల్ ఎస్పీ సుప్రజా పరివేక్షిచారు. 791 మంది అభ్యర్థులు హాజరవ్వగా 484 మంది అర్హత సాధించినట్లు ఐ.జి తెలిపారు. వీరికి సర్టిఫికెట్స్ వెరిఫికేషన్ తర్వాత బయోమెట్రిక్, ఎత్తు, ఛాతి వంటి ఫిజికల్ మెజర్మెంట్ టెస్టుల అనంతరం ఫిజికల్ ఎఫిషియన్సీ టెస్ట్‌లతో పాటు 1600,100 మీటర్ల పరుగు, లాంగ్ జంప్ పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో డీఎస్పీలు శ్రీనివాసరావు, చంద్రశేఖర్‌రావు, ఆర్ఐలు రాజారావు, రమేష్ కృష్ణన్, థామస్ రెడ్డి, రాఘవయ్యా, సిఐలు, ఎస్సైలు, ఐజి కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.



కష్టాల పంట-నష్టాల గాయం

(మొదటి పేజీ తరువాయి)

ఈసారి భిన్నమైన పరిస్థితి నెలకొంది. వర్షాలు అనుకూలించకున్నా ధరలు తగ్గడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పుడిప్పుడే పంట చేతికి వస్తున్న రైతులు తాజా ధరలతో తమకు కోత కూలి కూడా రాదని వాపోతున్నారు. మరికొందరు రైతులతే పంటను కోయకుండా తోటలనే దున్నేయాలని చూస్తున్నారు.

నరసరావుపేట మండలంలో ఉప్పలపాడు, అర్వపల్లి, గురవాయపాలెం, తురకపాలెం, పమిడిమర్రు, కొండకావూరు తదితర గ్రామాలలో ఓగేరు వాగు నీటితో పాటు, అందుబాటులో నీటి వనరులు ఉన్న రైతులు బెండ, దొండ, టమాటా, మునగ, చిక్కుడు, సొర, గుమ్మడి, దోస తదితర కూరగాయల పంటలు 375 ఎకరాలకుపైగా సాగు చేస్తున్నారు. ఈ ఏడాది వర్షాల్లేక వరి, పత్తి, మిర్చి సాగు చేసే రైతులు సైతం కొద్దిపాటి నీటితో సాగు చేసే కూరగాయ పంటల వైపు మొగ్గు చూపుతున్నారు. వీరంతా ఈ పంటను నరసరావుపేటలోని మార్కెట్‌లో కమీషన్ వ్యాపారులకు పంటను అమ్ముతుంటారు. ఈ క్రమంలో దళారులు ధరలను పడేయడంతో కూరగాయల సాగుకు రైతులు వెనకడుగేస్తున్నారు.

కూరగాయలు సాగు చేయాలంటే దుక్కి దున్నడం దగ్గర నుండి విత్తన కొనుగోలు వరకు, మొక్క పెరిగిన తర్వాత చీడ పీడలు, తెగుళ్ల బెడద, నీటి కష్టాలను ఎదుర్కోవాల్సి ఉంటుంది. ఈ సవాళ్లనింటిని తట్టుకుని పంటను పండించిన రైతు చివరకు దళారి చేతిలో దోపిడీకి గురై అప్పుల పాలవుతున్నారు. మరోవైపు బహిరంగ మార్కెట్లో రూ.30-50 వరకూ వివిధ రకాల కూరగాయల ధరలు పలుకుతున్నాయి. ఇందులో పదో వంతు కూడా రైతులకు దక్కడం లేదు. దొండ రూ.3, బెండ రూ.6-7, టమాటా రూ.5-6 కూడా రావడం లేదని రైతులు వాపోతున్నారు.

అయితే ప్రస్తుతం మార్కెట్‌లో ఏ కూరగాయ కొనాలన్నా కిలో రూ.30 వరకూ ఉంది. రైతుకు మాత్రం రూ.10 కూడా దక్కడం లేదు. నెల కిందట దొండకాయ రూ.20 వరకు, బెండ కాయ రూ.18 వరకు, టమాటాలు రూ.15 వరకూ రైతులు అమ్ముకున్నారు. ఇప్పుడు అందులో సగం ధర కూడా దక్కడం లేదు. తీవ్రమైన నీటి ఎద్దడి ఉన్నా బావులు, ఇంజిన్ల ద్వారా నానా కష్టాలు పడి పొలాలకు నీరు పెట్టుకున్నామని, రేయింబవళ్లు కంటికి రెప్పలా పైరును కాపాడుకున్నామని, పంట చేతికొచ్చే సరికి నష్టాలే వస్తున్నాయని రైతులు ఆవేదనకు గురవుతున్నారు.



ఆటో డ్రైవర్లు కు కౌన్సెలింగ్

ప్రజాశక్తి-తెనాలిరూరల్

తెనాలి మార్కెట్ సెంటర్ కూడలిలో గురువారం ఆటో డ్రైవర్లకు ట్రాఫిక్ పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. పట్టణ ట్రాఫిక్ ఎస్ఐ శివరామయ్య ఆధ్వర్యంలో ట్రాఫిక్ నియమనిబంధనలపై ఆటో డ్రైవర్లకు కౌన్సిలింగ్ నిర్వహించి వారితో మాట్లాడారు. ఆటో డ్రైవర్లు ఖచ్చితంగా డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలన్నారు. ఆటోలో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించవద్దని సూచించారు. ఆటో వెలుపల సౌండ్ బాక్సులు పెట్టరాదని, అతివేగం ప్రమాదకరమని హెచ్చరించారు. రోడ్లపై అడ్డదిడ్డంగా వాహనాలు నిలుపుటవలన ట్రాఫిక్ తో పాటు ప్రజలకు అసౌకర్యం కలుగుతుందన్నారు. ట్రాఫిక్ నియమ నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించిన ఆటో డ్రైవర్లపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో పలువురు ట్రాఫిక్ సిబ్బంది పాల్గున్నారు.

పైపులైను, సీసీ రోడ్లకు శంకుస్థాపన

ప్రజాశక్తి- గుంటూరు సిటి

గుంటూరు తూర్పు నియోజకవర్గం అభివద్ధిలో భాగంగా 17,53 డివిజన్ పరిధిలోని చంద్రబాబు నాయుడు కాలనీ, హుస్సేన్ సాగర్‌తో పాటు సంజీవయ్య నగర్‌లో వైసిపి గుంటూరు జిల్లా ప్రధాన కార్యదర్శి నూరి ఫాతిమా తాగునీటి పైప్ లైన్, సీసీ రోడ్ల గురువారం శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు రామబోయిన అజయ్, ధూపటి వంశీ, ఫర్జానా, ఆయిశెట్టి శ్రీను, సల్మాన్, అక్కులయ్య, మరియమ్మ పాల్గొన్నారు.



రేపు నట సామ్రాట్ అక్కినేని శతజయంతి వేడుకలు


ప్రజాశక్తి - గుంటూరు

నట సామ్రాట్ అక్కినేని నాగేశ్వరరావు శత జయంతి వేడుకలు 23వ తేదీ స్థానిక గుంటూరు శ్రీ వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో ఘనంగా జరుపుతున్నట్లు అక్కినేని ఫౌండేషన్ ఆఫ్ అమెరికా వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ తోటకూర ప్రసాద్ పేర్కొన్నారు. గురువారం గుంటూరులో ఆయన మీడియాతో మాట్లాడుతు ఈ వేడుకల్లో వివిధ రంగాలలో లబ్ద ప్రతిష్టులైన ప్రముఖులకు అవార్డుల ప్రధానం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా డాక్టర్ అక్కినేని కుటుంబ సభ్యులు, సినీ గేయ రచయిత భువనచంద్ర, మాటల రచయిత బుర్ర సాయి మాధవ్, వేద కవి జొన్నవిత్తుల రామలింగేశ్వర రావు, డాక్టర్

పలువురుకి అవార్డులు ప్రదానం

అక్కినేని ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ తోటకూర ప్రసాద్

పాటిబండ్ల దక్షిణామూర్తి, తదితరులు పాల్గొంటారన్నారు. ప్రముఖ సాహిత్య పరిశోధకులు పారా అశోక్ కుమార్ రచించిన 'అక్కినేని 100' (శత వసంతాల అక్కినేని కి చిత్రాంజలి) పుస్తక ఆవిష్కరణ చేస్తామన్నారు. ఈ సందర్భంగా పద్మశ్రీ అన్నవరపు రామస్వామి, డాక్టర్ కొండబోలు బసవ పున్నయ్య, ప్రముఖ నవలా రచయిత్రి లల్లాదేవి, మనసు ఫౌండేషన్ ఎంబి రాయుడు, చిత్రకళాకారుడు రాపర్ల వినోద్ చౌదరి తదితర ప్రముఖులకు పురస్కార ప్రధానోత్సవం జరుగుతుందని



చెప్పారు. అపర ఘంటసాల బాలకామేశ్వరరావు, శాంతిశ్రీ బృందం చే అక్కినేని పాటల సంగీత విభావరి చందు (హైదరాబాద్) బృందం ప్రదర్శన కార్యక్రమాలు ఆహుతులను అలరింప చేయనున్నాయని అన్నారు. నగర ప్రజలు, అక్కినేని అభిమానులు, సినీ, సాహిత్యాభిమానులు కార్యక్రమంలో పాల్గొని జయప్రదం చేయవలసిందిగా డాక్టర్ తోటకూర ప్రసాద్ కోరారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

ప్రజాశక్తి-తెనాలి

రోడ్డు ప్రమాదంలో మామ అల్లుళ్ల గాయపడ్డారు. పట్టణ త్రీటౌన్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం బాపట్ల జిల్లా అమృతలూరు మండలం పెదపూడి గ్రామానికి చెందిన మామా అల్లుళ్ల ప్రభుదాస్, నరేష్ బుధవారం రాత్రి బైక్‌పై తెనాలి వస్తున్నారు. వైకుంఠపురం సమీపంలోకి రాగానే వెనుకనుంచి వచ్చిన లారీ వీరి వాహనాన్ని ఢీకొట్టింది. ప్రమాదంలో గాయపడిన ఇరువురినీ 108 అంబులెన్స్‌లో ఆసుపత్రికి తరలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

దాడి ఘటనపై కేసు నమోదు

ప్రజాశక్తి-తెనాలి : దాడి ఘటనపై పట్టణ ఒన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. వారు వెల్లడించిన వివరాల ప్రకారం పట్టణంలోని చినరావూరుతోటకు చెందిన షేక్ జమాల్ బుధవారం రాత్రి పూటుగా మద్యం సేవించాడు. మద్యం మత్తులో ఇంటికి వచ్చిన జమాల్ తన తండ్రి అల్లాభక్షుపై దాడి చేశాడు. బాధితుడు తెనాలి జిల్లా వైద్యశాల్లో చికిత్స పొందుతూ ఇచ్చిన పిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

యువతిని వేధించిన కేసులో

ఒకరికి జైలుశిక్ష, జరిమానా


ప్రజాశక్తి-తెనాలి

యువతిని వేధింపులకు గురిచేసి, కులంపేరుతో దూషించిన ఘటనలో నిందితునికి జైలు శిక్ష, జరిమానా విదిస్తూ న్యాయమూర్తి గురువారం తీర్పునిచ్చారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం స్థానిక నాజరుపేటకు చెందిన యువతి పొట్లూరి ప్రసన్న ఇళ్ళలో పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తోంది. ఈ నేపథ్యలో 2019లో పట్టణానికి చెందిన వి.జయరావు ఇంట్లో పనిచేస్తున్న క్రమంలో, జయరావు ఆమెతో అసభ్యంగా ప్రవర్తించాడు. దీనిపై ఆమె ప్రతిఘటించి, కేకలు వేయటంతో పక్క ఇంట్లోనే పనిచేస్తున్న ప్రసన్న తల్లి అక్కడకు చేరుకుంది. అదేమని ప్రశ్నించిన ఆమెను, ప్రసన్నను కులంపేరుతో జయరావు దూషించాడు. బాధితులు పట్టణ ఒన్‌టౌన్ పోలీసులకు పిర్యాదు చేయటంతో అప్పటి డిఎస్పీ శ్రీలక్ష్మి నిందితునిపై కేసు నమోదు చేశారు. గుంటూరు ఎస్సీ, ఎస్టీ కోర్టులో గురువారం కేసు విచారణకు వచ్చింది. సాక్ష్యాధారాలను పరిశీలించిన న్యాయమూర్తి నిందితునికి ఏడాది జైలు శిక్ష, రూ.1500జరిమానా విదిస్తూ తీర్పునిచ్చారు. ప్రాసిక్యూషన్ తరపున పబ్లిక్ ప్రాసిక్యూటర్ శారదామణి వాదించారు.

కెఎస్ఎం హైస్కూల్‌లో చోరీ.. నాడు నేడు రికార్డులు మాయం

ప్రజాశక్తి-తెనాలి

స్థానిక చెంచుపేట కేఎస్ఎం హైస్కూల్‌లో చోరీ జరిగింది. గుర్తు తెలియని వ్యక్తులు గురువారం తెల్లవారు జాము 2.30 గంటల సమయంలో పాఠశాల్లోకి ప్రవేశించి ప్రధానోపాధ్యాయుల కార్యాలయంలో బీరువా పగులగొట్టారు. దానిలో ఉన్న నాడు-నేడు ఫేజ్-2కి సంబందించిన రికార్డులను, అలాగే విద్యార్థుల తాగునీటికోసం ఏర్పాటు



చిందరవందరగా ఉన్న బీరువా, కార్యాలయం

చేసిన ఆర్వోప్లాంట్, మోటారు, బాత్‌రూమ్స్‌లో ట్యాపులు అపహరించారు. రాత్రి ఒంటి గంట వరకూ ఉన్న వాచ్‌మెన్ ఇంటికి వెళ్ళడంతో దొంగతనం జరిగింది. ఉదయాన్నే వచ్చి గమనించిన వాచ్‌మెన్ ప్రధానోపాధ్యాయులు కె.రాజారెడ్డికి సమాచారం ఇచ్చారు. ఆయన మండల విద్యాధికారి మేకల లక్ష్మినారాయణకు, అలాగే వార్డు కౌన్సిలర్ గోగిరెడ్డి మానసారెడ్డికి సమాచారం ఇచ్చారు. వారు పాఠశాలకు వచ్చి పరిశీలించిన అనంతరం ఎంఈవో త్రీటౌన్ పోలీసులకు సమాచారమిచ్చారు. పోలీసులు కేసు నమోదు చేసి, క్లూస్‌టీమ్‌ను రప్పించి ఆధారాలు సేకరించే పనిలో పడ్డారు. కాగా పాఠశాల్లో నాడు-నాడు ఫేజ్-2లో దాదాపు రూ.50లక్షల పైచిలుకు నిధులతో అదనపు తరగతి గదుల నిర్మాణం జరుగుతోంది. ఈ నేపథ్యంలో ఆ రికార్డు మాయం కావటంపై ఇంటి దొంగల పనిగా అంతా భావిస్తున్నారు. పోలీసులు వాచ్‌మెన్‌ను, అలాగే నాడు నేడు పనులతో సంబంధం ఉన్న వివిధ విభాగాల వారిని విచారిస్తున్నట్లు సామాచారం.

రోడ్డు ప్రమాదంలో హెడ్‌కానిస్టేబుల్ మృతి

ప్రజాశక్తి-ముప్పాళ్ల :మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌లో పనిచేస్తున్న హెడ్ కానిస్టేబుల్ గుండిగ అనిల్ కుమార్(42) రోడ్డు ప్రమాదంలో గురువారం మృతి చెందారు. ఫిరంగిపురం మండలం వేమూలూరిపాడు గ్రామానికి చెందిన అనిల్ నర్సారావుపేట టూటౌన్ పోలీసు స్టేషన్‌లో పనిచేస్తూ ఇటీవల బదిలీపై ముప్పాళ్ల పోలీసు స్టేషన్‌కు వచ్చారు. ఈ క్రమంలో గుంటూరులో ఎస్ఐ దేహదారుఢ్య పరీక్షలు జరుగుతున్న నేపథ్యంలో అనిల్‌కు గుంటూరులో పోలీసు అధికారులు బందోబస్తు నిమిత్తం డ్యూటీ వేశారు. గురువారం సాయంత్రం గుంటూరులో విధులు ముగించుకుని తన స్వగ్రామమైన వేమూలూరిపాడు వస్తున్న సందర్భంలో లారీ ఢీకొని అనిల్ కుమార్ అక్కడికక్కడే మృతి చెందాడు. అనిల్ కు భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు.పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

25న అంగన్వాడి ధర్నాను జయప్రదం చేయండి

ప్రజాశక్తి -మంగళగిరి

అంగన్వాడీల సమస్యల పరిష్కారం కోసం ఈనెల 25వ తేదీన విజయవాడ జరిగే మహాధర్నాను జయప్రదం చేయాలని ఏపీ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ మంగళగిరి ప్రాజెక్ట్ గౌరవాధ్యక్షులు వేముల దుర్గారావు అన్నారు. గురువారం మంగళగిరి సి డి పి ఓ కు వినతిపత్రం అందజేసిన అనంతరం ఆయన మాట్లాడారు. గత ఎన్నికలకు ముందు వైసీపీ అధికారంలోకి వస్తే తెలంగాణ కంటే అదనంగా జీతాలు ఇస్తామని చెప్పి వాగ్దానం చేసి ఇంతవరకు అమలు చేయలేదని విమర్శించారు. కనీస వేతనం అమలు కావడం లేదని అన్నారు. ఈ సమస్యల పరిష్కారానికి జరిగే మహా ధర్నాకు అంగన్వాడీలు పెద్ద సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు కుమారి, కోటేశ్వరి, నిర్మల, లూథమేరి తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికులకు ఉచిత వైద్యశిబిరం

ప్రజాశక్తి-తెనాలి

నిత్యం పట్టణ పరిశుభ్రతకు పాటుపడే కార్మికుల ఆరోగ్య సంరక్షణకు ఉచిత వైద్య శిబిరం నిర్వహించినట్లు మున్సిపల్ కమిషనర్ ఎం.జస్వంతరావు చెప్పారు. ఇండియన్ స్వచ్ఛతా లీగ్ కార్యక్రమంలో భాగంగా స్థానిక పాత ప్రభుత్వ వైద్యశాల్లో 2, 3 శానిటరి డివిజన్లకు చెందిన 70 మంది పారిశుధ్య కార్మికులకు గురువారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. అర్బన్ హెల్త్ సెంటర్ల వైద్యులు డాక్టర్ షేక్ బిబిజాన్, డాక్టర్ యుకె కిషోర్, మున్సిపల్ ఆరోగ్యాధికారిణి డాక్టర్ కెసిహెచ్ నిర్మల కార్మికులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. శ్వాసకోశ, చర్మ సంబంధిత వ్యాధులతో పాటు బిపి, షుగర్ వంటి రుగ్మతలకు పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో శానిటరి ఇన్‌స్పెక్టర్ ఎ.రామచంద్రరావు, షేక్ బాజిహుస్సేన్, ఎం.సుబ్బారావు, వై.అనుపమ, శానిటేషన్ సెక్రటరీలు బి.శ్రావణ్, జి.దివ్య, ఎ.జ్యోత్స్న, కె.యురియాపాల్, డి.మురళీధర్, కె.ఉదయకిరణ్ పాల్గొన్నారు.

175 స్థానాల్లో ఒంటరిగానే పోటీ

బీసీవై పార్టీ అధ్యక్షులు బోడె రామచంద్ర యాదవ్

ప్రజాశక్తి - మంగళగిరి రూరల్

రాష్ట్రంలో ప్రత్యామ్నాయ రాజకీయ పార్టీ అధికారంలోకి రావాల్సిన అవసరం వచ్చిందని, అన్ని వర్గాల ప్రజలకు న్యాయం జరగాలనే సదుద్దేశంతో తమ పార్టీ ఆవిర్భవించిందని భారత చైతన్య యువజన పార్టీ (బిసివైపి) రాష్ట్ర అధ్యక్షుడు బోడె రామచంద్ర యాదవ్ స్పష్టం చేశారు. అవినీతి రాజకీయాలను అంతం చేసి, ప్రతి ఒక్కరికీ న్యాయం చేసే ప్రభుత్వం రావాలని ఆకాంక్షించారు. మంగళగిరి లోని హ్యాపీ రిసార్ట్స్‌లో గురువారం కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తొలుత బీసీవైపీ అజెండా, మానిఫెస్టోలను ప్రవేశపెట్టి



మానిఫెస్టో పోస్టర్‌ను విడుదల చేస్తున్న బోడె రామచంద్ర యాదవ్

ఆమోదించారు. అనంతరం రామచంద్ర యాదవ్ మాట్లాడుతూ రాబోయే రోజుల్లో పార్టీని ఇంటింటికీ ప్రజల్లోకి తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. ఏ విధంగా పార్టీ సిద్ధాంతాలు, ఆశయాలను తీసుకెళ్లాలో కార్యాచరణ రూపొందించా మన్నారు. త్వరలో జిల్లాలవారీగా బీసీవైపీ నాయకులు, కార్యకర్తలతో సమావేశాలు నిర్వహిస్తామని వెల్లడించారు. గత ప్రభుత్వంలో అవినీతికి పాల్పడిన చంద్రబాబు తప్పు చేసి జైలుకెళ్లారని రామచంద్ర యాదవ్ అన్నారు. ముఖ్యమంత్రి జగన్ కూడా తండ్రి అధికారాన్ని దుర్వినియోగం కాబట్టి జైలుకు పంపాలని సంచలన వ్యాఖ్యలు చేశారు. అధికారం ప్రజాసేవకే కానీ, అవినీతి, అక్రమాల కోసం కాదని స్పష్టం చేశారు. రాబోయే ఎన్నికల్లో బీసీవైపీ ఒంటరిగా పోటీ చేస్తుందని రామచంద్ర యాదవ్ తెలిపారు. తమకు ఏ పార్టీతో పొత్తులు లేవని, ప్రజలతోనే తమ పొత్తు అని పేర్కొన్నారు. బీసీవైపీ ఆశయాలు నచ్చిన ఎంతో మంది అన్ని పార్టీల నుంచి తమ దగ్గరకు వస్తున్నారని, త్వరలో రాష్ట్ర రాజకీయాలను కుదిపేలా భారీ చేరికలు ఉంటాయని వివరించారు. మంచి ఆశయాలతో వచ్చామని, 175 నియోజకవర్గాల్లో పోటీ చేసి విజయం సాధిస్తామని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో బీసీవైపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కవి ఆళ్లకు గురజాడ పురస్కారం

ప్రజాశక్తి-తెనాలి



అభ్యుదయ కవి గురజాడ అప్పారావు జయంతోత్సవాలను పురస్కరించుకుని వైఎస్సార్ కడప జిల్లా ప్రొద్దుటూరుకు చెందిన మనం ఫౌండేషన్ జూమ్ వేదికగా గురు వారం పట్టణానికి చెందిన కవి, వృత్తిరీత్యా కండక్టరైన ఆళ్ళ నాగేశ్వరరావుకు గురజాడ వేంకట అప్పారావు జీవిత సాఫల్య పురస్కారాన్ని అందించింది. సాహితీ రంగంలో ఆళ్ళ చేసిన సేవలను ఫౌండేషన్ వ్యవస్థాపకులు డాక్టర్ కె చక్రవర్తి ప్రశంసించినట్లు ఆళ్ళ తెలిపారు. ఈ సందర్భంగా పట్టణానికి చెందిన పలువురు సాహితీ ప్రియులు ఆళ్ళను అభినందించారు.



తుళ్లూరు దీక్షా శిబిరంలో కొవ్వొత్తులతో నిరసన తెలుపుతున్న రైతులు, మహిళలు

కౌలు తక్షణమే చెల్లించాలి

ప్రజాశక్తి - తుళ్లూరు

ప్రభుత్వం తక్షణమే కౌలు చెల్లించాలని రైతులు, మహిళలు డిమాండ్ చేశారు.మే లో చెల్లించాల్సిన కౌలు ఇప్పటివరకు చెల్లించలేదని,ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి పోలీసులు, పరదాల చాటున తిరుగుతున్నారని మండిపడ్డారు. రాష్ట్ర ఏకైక రాజధానిగా అమరావతిని కొనసాగించాలంటూ రైతులు, మహిళలు, రైతు కూలీలు చేస్తున్న దీక్షలు గురువారంతో 1374 వ రోజుకు చేరాయి. తుళ్లూరు,మందడం, వెలగపూడి, వెంకటపాలెం, నెక్కల్లు, అనంతవరం తదితర గ్రామాల్లో దీక్షలు సాగాయి.అమరావతి వెలుగు కార్యక్రమంలో భాగంగా కొవ్వొత్తులు వెలిగించి బిల్డ్ అమరావతి - సేవ్ ఆంధ్రప్రదేశ్,ఒకే రాష్ట్రం,ఒకే రాజధా నంటూ నినాదాలు చేశారు.



ప్రభుత్వ వైద్యశాలల్లో మెరుగైన సేవలు

ప్రజాశక్తి - పొన్నూరు రూరల్

ప్రభుత్వ వైద్యశాలల్లో మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నట్ల గుంటూరు జిల్లా డిసిహెచ్ఎస్ డాక్టర్ కే .సుబ్రహ్మణ్యం రాజు అన్నారు. గురువారం నిడుబ్రోలు ప్రభుత్వ ప్రాథమిక వైద్యశాలను ఆయన సందర్శించారు. వైద్యశాలలో రోగులకు అందుతున్న వైద్య సేవలు, వసతులు తదితర అంశాలను పరిశీలించారు. అనంతరం పలు రికార్డులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరలతో మాట్లాడుతూ ముందు ప్రభుత్వ వైద్యశాలకు తక్కువ సంఖ్యలో రోగులు వచ్చే వారన్నారు. ప్రస్తుతం ఆ పరిస్థితి మారిందని సుమారు 40 నుంచి 50 శాతం ప్రజలు చికిత్స కోసం ప్రభుత్వ వైద్యశాలలకు తరలివస్తున్నట్లు పేర్కొన్నారు. నిడుబ్రోలు ప్రభుత్వ వైద్యశాలలో చిన్నపిల్లల డాక్టర్, ప్రసూతి వైద్యులు, జనరల్ సర్జన్, దంత వైద్యులు పూర్తిస్థాయిలో అందుబాటు ఉన్నారని అన్నారు. ఆరోగ్య శ్రీ ద్వారా ప్రభుత్వము ఉచిత వైద్యంతో పాటు మందులు అందిస్తుందన్నారు. దీనికి తోడు చికిత్స సమయంలో ఎన్ని రోజులు రోగి వైద్యశాలలో వైద్యం నిమిత్తం ఉన్నారో అన్ని రోజులు వారి జీవనభృతిని వారి అకౌంట్లోనే నేరుగా జమ చేయడం జరుగుతుందన్నారు. నిడుబ్రోలు వైద్యశాలలో హార్ట్ ఎటాక్ వచ్చిన వారికి ఎమర్జెన్సీ సమయంలో వేయాల్సిన రూ 30000 ఖరీదు చేసే ఇంజక్షన్లు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. ఇంజక్షన్లు ఉమ్మడి గుంటూరు జిల్లాలోని అన్ని పీహెచ్సీ సెంటర్లలో అందుబాటులోకి తెచ్చినట్లు వివరించారు. కార్యక్రమంలో సూపరింటెండంట్ రేష్మ, డాక్టర్లు ఫిరోజ్ ఖాన్ శ్రీకృష్ణ శ్యామ్ ప్రియదర్శిని రాణి సిబ్బంది పాల్గొన్నారు.

కాలానికి ముందు నడిచిన గురజాడ అప్పారావు




గ్రంథాలయంలో గురజాడ చిత్ర పటానికి పూల మాలలేసి నివాళి.. మధుసూదన్‌ను సన్మానిస్తున్న ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు

ప్రజాశక్తి - పల్నాడు జిల్లా

తన రచనల ద్వారా సాంఘిక పరివర్తనకు ప్రయత్నించిన మహాకవి గురజాడ అప్పారావు అని అసిస్టెంట్ రిజిస్ట్రార్ స్వర్ణ చిన రామిరెడ్డి అన్నారు. మహిళ కన్నీటి గాధలకు ఆర్థిక స్వాతంత్రం లేకపోవడమేనని గ్రహించిన ఆయన పీడిత కులాల జీవితాల్లోనూ ఆ సమస్యకున్న ప్రాధాన్యాన్ని గమనించారని, ఆర్థిక స్వావలంబనకు ఆధునిక విద్యను అందజేసి చైతన్యం నింపారని చెప్పారు. నరసరావుపేటలోని శాఖా గ్రంధాలయంలో గురువారం గురజాడ అప్పారావు జయంతి సభను శ్రీనాధ సాహితీ పరిషత్ ఆధ్వర్యంలో నిర్వహించారు. గురజాడ చిత్ర పటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. స్వర్ణ చినరామిరెడ్డి మాట్లాడుతూ తెలుగు భాషా సాహిత్యాల గురించి ఉత్తమైన ఆలోచనలో ఉన్న గురజాడ ప్రజలను విద్యకు దూరం చేసే బాషా వ్యాకరణ నియమాల స్థానంలో సరళమైన భాషా ప్రయోగాలను అమలుకు కృషి చేశారని కొనియాడారు. తెలుగు సాహిత్యాన్ని సుసంపన్నం చేసిన గొప్ప సాహితీకారులలో ఒకరైన గురజాడ హేతువాది అన్నారు. 19వ శతాబ్దంలోను, 20 వ శతాబ్ది మొదటి దశకంలో గురజాడ రచనలు నేటికి ప్రజల మన్ననలను పొందుతున్నాయన్నారు. సామాన్య ప్రజలకు అర్థమయ్యే వాడుక భాషలో రచనలు చేశారని, కన్యాశుల్కం నాటకానికి సాహితీ లోకంలో ఒక ప్రత్యేకమైన స్థానం ఉందని చెప్పారు. అభ్యుదయ కవితా పితామహుడు అని బిరుదు పొందిన గురజాడ తెలుగు సాహిత్యంలో వాడుక భాష ఒరవడికి కృషి చేసి కవి శేఖర అనే బిరుదు అందుకున్నారన్నారు. కార్యక్రమములో విద్యార్థిని, విద్యార్థులు, గ్రంథాలయ సిబ్బంది పాల్గొన్నారు.

క్రాంతాదర్శి గురజాడ

కాలానికి ముందు నడచిన క్రాంతదర్శి గురజాడ అని మాతృశ్రీ ఓరియంటల్ కళాశాల జిల్లెల్లమూడి తెలుగు అధ్యాపకులు పి.మధుసూదనరావు అన్నారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మహాకవి గురజాడ అప్పారావు జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మధుసూదన్ మాట్లాడుతూ ఆధునిక సాహిత్య విప్లవ వైతాళికుడు గురజాడల జీవితాన్ని ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలన్నారు. బాల్యవివాహాలను నిరసిస్తూ సంచలన తిరుగుబాటుకు కలం కదిపారన్నారు. దేశమంటే మట్టి కాదోయ్ దేశమంటే మనుషులోయ్, సొంత లాభం కొంత మానుకో పొరుగువారికి పాటుపడవోయ్ అని మార్క్సిస్టు దక్పథాన్ని తన సాహిత్యంలో చూపించారన్నారు. సదస్సుకు అధ్యక్షత వహించిన ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వి.హనుమంతయ్య మాట్లాడుతూ సాంఘిక దురాచారాలను సాహిత్యంలో దునుమాడి, సంఘ సంస్కరణ సాహిత్యం సృష్టించిన నవయుగ సాహిత్య వైతాళికుడు గురజాడ అని, ప్రతి కవితా సామాజిక స్పృహతో రాశారని కొనియాడారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్, తెలుగు శాఖ ఆచార్యులు డాక్టర్ కాకాని సుధాకర్, అతిథి అధ్యాపకులు పి.సునీల్ విద్యార్థులు పాల్గొన్నారు.

అచ్చంపేట ఎస్‌బిఐలో బీమా గోల

రూ.2 లక్షల రుణానికి రూ.15 వేలు చెల్లించాలని ఖాతాదార్లకు ఒత్తిళ్లు



ప్రజాశక్తి - అచ్చంపేట

ఎస్‌బిఐలో పొలాన్ని తనఖా పెట్టిన రైతుకు రూ.10 లక్షల రుణం మంజూరైంది. దాన్ని తీసుకోవడానికి రైతు గురువారం బ్యాంకు వద్దకు వచ్చారు. అయితే రుణం నగదును ఖాతాలో జమ చేయాలంటే బీమా చెల్లించాల్సి ఉంటుందని, బ్యాంకు సిబ్బంది చెప్పారు. ఇందుకు రైతు అంగీకరించకపోవడంతో మేనేజర్‌ను కలవాలన్నారు. మేనేజర్ వద్దకు రైతు వెళ్లగా ఆయన లేకపోవడంతో రుణం తీసుకోకుండానే వెనుదిరిగారు. బ్యాంకులో బీమా పేరుతో జరుగుతున్న తంతుకు ఇదొక ఉదాహరణ.

రుణం పొందాలంటే బీమా తప్పనిసరి అని మండల కేంద్రమైన అచ్చంపేటలోని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బిఐ) మేనేజర్ నిబంధన పెడుతున్నారని ఖాతాదారులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ముద్ర రుణాలు పొందేవారు బీమా చెల్లించాల్సిన అవసరం లేదనే ఆదేశాలనూ పాటించడం లేదని, రూ.15 వేల బీమా చెల్లిస్తేనే రుణమిస్తానంటూ మేనేజర్ ఖరాఖండిగా చెంబుదున్నారని లబ్ధిదార్లు మండిపడుతున్నారు. దీనిపై ఎవరైనా ప్రశ్నిస్తే ఆర్‌బిఐ నిబంధనలు అంటూ బుకాయిస్తున్నారని చెబుతున్నారు.

2014లో ఈ బ్యాంకులో డ్వాక్రా మహిళలు, చిరు వ్యాపారులకు రుణాలిచ్చి అందులో నుండి రూ.25 వేలను బీమా సొమ్ముగా వసూలు చేశారు. దీనిపై రుణం పొందిన వారు ఫిర్యాదు చేయడంతో ఉన్నతాధికారులు విచారణ చేసి ఇక్కడ సిబ్బందిని బదిలీ చేశారు. మళ్లీ ఆరు నెలలుగా బీమా తంతు కొనసాగుతోంది. వ్యవసాయ రుణాలు తీసుకుంటున్న రైతుల వద్ద నుండి కూడా ఇన్సూరెన్స్ పేరుతో డబ్బులు వసూలు చేస్తున్నారు. బయట అధిక వడ్డీలకు అప్పులు తెచ్చుకోలేక బ్యాంకుకు వస్తుంటే ఇక్కడ బీమా పేరుతో వసూలు చేస్తున్నారని రైతులు అసహనానికి గురవుతున్నారు. అచ్చంపేటలో చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంక్, సెంట్రల్ బ్యాంక్, యూనియన్ బ్యాంకు శాఖలూ ఉన్నాయి. ఆయా బ్యాంకులలో బీమా ప్రీమియం రూ.వెయ్యి రెండు వేలలోపే నామమాత్రంగానే ఉండగా ఎస్‌బిఐలో మాత్రం రూ.రెండు లక్షలకు రూ.15 వేలు తీసుకుంటున్నారని ఖాతాదారులు చెబుతున్నారు. ఈ ప్రీమియం మొత్తంలో 30 శాతం కమీషన్ బ్యాంకు మేనేజర్‌కు వెళుతుందని, అందుకే ఒత్తిడి చేసి మరీ వసూలు చేస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు.

ఇన్‌ఛార్జి ఎపిపిగా బుచ్చిదంతాచారి

ప్రజాశక్తి - పల్నాడు జిల్లా



నరసరావుపేట అడిషనల్ అసిస్టెంట్ సెషన్స్ జడ్జి కోర్టులో అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా విధులు నిర్వర్తిస్తున్న బుచ్చిదంతచారిని 13వ అదనపు జిల్లా కోర్టు ఇన్‌ఛార్జి ఎపిపిగా నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. ఇప్పటివరకు ఏపీపీగా పని చేసిన కాకుమాను బాల హనుమంతరెడ్డి పదవీకాలం సెప్టెంబర్ 15తో ముగియడంతో నూతన నియామకం చేపట్టారు. ఈ సందర్భంగా బుచ్చిదంతాచారికి పలువురు న్యాయవాదులు శుభాకాంక్షలు తెలిపారు.

నెలరోజులు పాటు రైల్వేగేటు మూసివేత

ప్రజాశక్తి సత్తెనపల్లి రూరల్

సత్తెనపల్లి మండలం భృగుబండ రైల్వే గేటును రైల్వే అధికారులు శుక్రవారం నుండి మూసివేస్తున్నారు. సత్తెనపల్లి రెడ్డిగూడెం సెక్షన్ల మధ్య భృగుబండ రైల్వే లెవెల్ క్రాసింగ్ గేటు స్థానంలో అండర్ గ్రౌండ్ బ్రిడ్జిని నిర్మించారు.



ఆర్‌యూబీలో రోడ్డు నిర్మిస్తున్న నేపథ్యంలో నెల రోజులు పాటు రాకపోకలను నిషేధించారు. శుక్రవారం ఉదయం 7 గంటల నుండి వచ్చేనెల 22 తేదీ సాయంత్రం 6 గంటల వరకు రైల్వే గేటు ముసివేస్తున్నట్లు రైల్వే అధికారులు గురువారం తెలిపారు. వాహనదారులు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

బాల్య వివాహాల నిర్మూలనలో ప్రజాప్రతినిధులు కీలకం

ప్రజాశక్తి - బెల్లంకొండ

బాల్య వివాహాలు నిర్మూలించడంలో ప్రజాప్రతినిధుల పాత్ర కీలకమని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యురాలు బత్తుల పద్మావతి, ఎంపిపి చెన్నపరెడ్డి పద్మా వెంకటేశ్వర్‌రెడ్డి అన్నారు. బాల్య వివాహాల నిషేధ చట్టం-2006, జిఒ ఎంఎస్ 31పై మండల కేంద్రమైన బెల్లంకొండలోని ఎంపిడిఒ కార్యాలయంలో మండల స్థాయి ప్రజాప్రతినిధులు, అధికారులు, సిబ్బందికి గురువారం అవగాహన, సమీక్ష నిర్వహించారు. కార్యక్రమానికి సిడిపిఒ స్వర్ణ కుమారి అధ్యక్షత వహించగా ఎంపిపి మాట్లాడుతూ బాలల విద్య కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు, ప్రోత్సాహకాలను ఉపయోగించుకోవాలని, వారిని చదివించి బంగారు భవితను ఇవ్వాలని కోరారు. బాల్య వివాహాలు జరగకుండా ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. అమ్మాయి వయసు 18 సంవత్సరాలు అబ్బాయి వయసు 21 సంవత్సరాలు దాటిన తర్వాత మాత్రమే పెళ్లిళ్లు చేయాలని సూచించారు. బత్తుల పద్మావతి మాట్లాడుతూ బాల్య వివాహాలు చేయించిన వారికి, హాజరైన వారికి రెండేళ్లు జైలు శిక్ష, రూ.లక్ష జరిమానా విధిస్తారని తెలిపారు. బాల్య వివాహాల నిర్మూలనలో గ్రామస్థాయిలో బాల్య వివాహాల నిరోధక కమిటీలకు చైర్మన్‌గా ఉన్న సర్పంచ్ ప్రధాన పాత్ర పోషించాలని చెప్పారు. 14 ఏళ్లలోపు బాలికను పెళ్లి చేసుకున్న మేజర్ వరుడికి 20 ఏళ్లపాటు, 16-18 సంవత్సరాలు లోపు అమ్మాయిని పెళ్లి చేసుకున్న వరుడికి పదేళ్ల వరకూ కఠినగార శిక్ష ఉంటుందని వివరించారు.



మాట్లాడుతున్న బత్తుల పద్మావతి

అనంతరం నిర్వహించిన సమీక్షలో నిలిపేసిన బాల్య వివాహాలు, బడిలో చేర్చిన బాలల వివరాలపై అడిగారు. 9 మంది సభ్యులతో కూడిన బాల్యవివాహాల నిషేధ కమిటీ ప్రతినెలా సమావేశమవ్వాలని చెప్పారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి జి.వెంకటరెడ్డి, ఎంపిడిఒ వెంకట్‌రెడ్డి, ఎంఇఒ బాలసుందరరావు, వైద్యాధికారి డాక్టర్ కోటేశ్వరరావు, ఎస్సై అమీర్, అంగన్వాడి సూపర్వైజర్ పరిమళ, వనజ పాల్గొన్నారు.



పాఠశాలల్లో ఆటల సందళ్లు

ప్రజాశక్తి - అచ్చంపేట

విద్యార్థులకు విద్యతోపాటు క్రీడల్లోనూ రాణించాలని, శారీరక, మానసిక ఉల్లాసానికి క్రీడలు ఎంతగానో దోహదపడతాయని మండల విద్యాశాఖ అధికారి నరసింహారావు అన్నారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో గురువారం అచ్చంపేట జెడ్‌పి పాఠశాలలో నియోజకవర్గ స్థాయిలో వాలీబాల్, కబడ్డీ పోటీలు నిర్వహించారు. నియోజకవర్గంలోని అన్ని మండలాల నుండి 300 మంది క్రీడాకారులు ఈ పోటీల్లో పాల్గొన్నట్లు పాఠశాల హెచ్‌ఎం సిహెచ్ కళ్యాణి తెలిపారు. పోటీలను నియోజకవర్గ కో-ఆర్డినేటర్ సిహెచ్ నాగరాజు, అచ్చంపేట స్పోర్ట్స్ కో-ఆర్డినేటర్ ఎ.సుజాత, సత్యనారాయణ, కోసూరు స్పోర్ట్స్ కో-ఆర్డినేటర్ శ్రీధర్, అమరావతి మండల స్పోర్ట్స్ కో-ఆర్డినేటర్ అనురాధ పర్యవేక్షించారు.



ప్రజాశక్తి - మాచర్ల

స్థానిక ప్రభుత్వ బాలుర పాఠశాలలో క్రీడా పోటీలు నిర్వహించారు. పోటీల్లో స్థానిక కృష్ణవేణి టాలెంట్ స్కూల్ విద్యార్థులు నియోజకవర్గ స్థాయి పోటీలకు పలువురు ఎంపికయ్యారు. ప్రిన్సిపాల్ హనుమంతురావు మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు క్రీడల పట్ల కూడ అసక్తి చూపాలన్నారు. ఉన్నత విద్యలో, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఉద్యోగాలలో కూడ క్రీడలలో రాణించిన వారికి ప్రత్యేక కోట ఉంటుందన్నారు. విద్యార్థులతోపాటు పీడీ ఆంజయ్యను భినందించారు.

ప్రజాశక్తి-ఈపూరు

క్రీడాకారులు లక్ష్యాల సాధనకు కృషి చేయడం ద్వారా సత్ఫలితాలు పొందవచ్చని ధనలక్ష్మి వ్యాయామ కళాశాల ప్రిన్సిపాల్ చుండు వెంకట్రావు అన్నారు. మండలంలోని ఎ.ముప్పాళ్ల గ్రామం ధనలక్ష్మి వ్యాయామ కళాశాలలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో గురువారం మండల స్థాయి అథ్లెటిక్స్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో బాలురు అండర్-17 విభాగంలో ఇ.గోపి (జెడ్‌పి పాఠశాల-బొగ్గరం), వి.యోహాను (జెడ్‌పి పాఠశాల-ఈపూరు), బాలికల విభాగంలో జె.వెంకాయమ్మ (జెడ్‌పి పాఠశాల-కొచ్చర్ల), వి.రోహిణి జెడ్‌పి పాఠశాల - ఎ.ముప్పాళ), బాలుర అండర్--14 విభాగంలో బి.మహేంద్ర (జెడ్‌పి పాఠశాల -ఎ.ముప్పాళ్ల), పి.పవన్ నరసింహ (జెడ్‌పి పాఠశాల-కొచ్చర్ల), బాలికల విభాగంలో కె.కర్మణి కావ్య (జెడ్‌పి పాఠశాల - ఈపూరు), ఎస్.అమృతవర్షిణి (జెడ్‌పి పాఠశాల - కొచ్చర్ల) విజేతలుగా నిలిచారు. పోటీలను వ్యాయామ ఉపాధ్యాయులు ఎ.వీరాంజనేయులు, ఎం.వెంకటేశ్వర్లు, వైవి చిరంజీవి, కె.గోపి, కె.ఏసురాజు, ఎన్.వెంకటేశ్వరరావు పర్యవేక్షించారు.



ప్రతి కౌలురైతుకూ రుణాలివ్వాలి

రైతు, కౌలు రైతుల సమస్యలు పరిష్కరించాలని ధర్నాలు, వినతులు


చిలువూరు యూనియన్ బ్యాంకు వద్ద ధర్నాలో మాట్లాడుతున్న బైరగాని శ్రీనివాసరావు

ప్రజాశక్తి-గుంటూరు

రైతుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఎపి రైతు సంఘం ఆధ్వర్యంలో గుంటూరు రూరల్, జొన్నలగడ్డ గ్రామ సచివాలయంలో వినతిపత్రం అందచేశారు. ముంపునకు గురువుతున్న పంటలను కాపాడాలని, రైతులకు, కౌలు రైతులకు రెండు లక్షల వరకూ రుణమాఫీ చేయాలని, పంటల బీమా పథకాన్ని రాష్ట్రప్రభుత్వమే కంపెనీ పెట్టిన రైతులకు న్యాయం చేయాలని ఉపాధి హామీ పనులు వందరోజులు పొడిగించి, బడ్జెట్ పెంచాలని, భూయజమానితో సంబంధం లేకుండా కౌలు రైతులకు పంట రుణాలు ఇవ్వాలని కోరారు. అలాగే వ్యవసాయ ఇన్‌పుట్స్ గ్రూపు ద్వారా కాకుండా వ్యక్తిగతంగా అందించాలన్నారు. కార్యక్రమంలో రైతు సంఘం గుంటూరు జిల్లా కార్యదర్శి కంచుమాటి అజయ్‌కుమార్, జిల్లా కమిటీ సభ్యులు ఇమ్మడి రామారావు, నామా సుబ్బారావు, ముప్పవరపు శేషయ్య, మిరాయాల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి -తాడికొండ

ఎరువులు నిలువలు చేసేందుకు గోడౌన్లు నిర్మించాలని రైతు సంఘం జిల్లా కార్యదర్శి కంచుమాటి అజయ్ కుమార్ అన్నారు. మండలంలోని మోతడక నిడుముక్కల గ్రామాలలోని రైతు భరోసా కేంద్రాలలో ఈ మేరకు వినతి పత్రం అందించారు. కార్యక్రమంలో రైతు సంఘం మండల కార్యదర్శి కనగాల పూర్ణచంద్రరావు చింతల భాస్కరరావు బాణావత్ భద్రయ్య, టీ రాజు పాల్గొన్నారు.



తాడికొండ, జొన్నలగడ్డలో వినతి పత్రాలు ఇస్తున్న కంచుమాటి అజయ్ కుమార్ తదితరులు

ప్రజాశక్తి - తాడేపల్లి రూరల్ : ఖరీఫ్ సీజన్‌లో అకాల వర్షాల వలన పంట నష్టపోయిన రైతులకు నష్టపరిహారం అందించాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం గుంటూరు జిల్లా అధ్యక్షులు జొన్న శివశంకరరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం ఎంటిఎంసీ పరిధిలోని వడ్డేశ్వరం, కొలనుకొండ, చిర్రావూరు గ్రామాలలో రైతు భరోసా కేంద్రాలలో, రైతు, కౌలు రైతు నాయకులతో వ్యవసాయ అధికారులను కలిసి వినతి పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా శివశంకరరావు మాట్లాడుతూ సెప్టెంబర్ నెల ముగుస్తున్న, ఈ ఖరీఫ్ సీజన్ లో కూడా ఇప్పటివరకు అకాల వర్షాల వలన పంటలు దెబ్బతిన్న రైతులకు నష్టపరిహారం అందలేదని ఆయన అన్నారు. అదేవిధంగా జిల్లా వ్యాప్తంగా సాగు రైతులకు రైతు భరోసా కేంద్రాలలో విత్తనాలు, ఎరువులు, వ్యవసాయ యంత్రాలు, వ్యవసాయ పరికరాలు ప్రభుత్వ సబ్సిడీలతో రైతులకు అందడం లేదని అన్నారు. తాడేపల్లి మండలంలో వివిధ గ్రామాల పరిధిలో పంట పొలాలలో డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడం వలన అధిక వర్షాలు కురిసినప్పుడు వర్షపు నీరు బయటకు పోయే దారి లేక పంటలన్నీ మునిగి, రైతులు తీవ్రంగా నష్టపోతున్నా రన్నారు. నష్టాల ఊబిలో కూరుకు పోతున్న రైతులు, కౌలు రైతులను ఆదుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం సత్వరమే చర్యలు చేపట్టాలన్నారు. కొండవీటి వాగు ముంపుకు గురవుతున్న పంటలకు శాశ్వత పరిష్కారం చేపట్టాలన్నారు. వ్యవసాయ మోటార్లకు 9 గంటల పగలు విద్యుత్ అందించి పంటలను కాపాడాలన్నారు. అదేవిధంగా దేవాదాయ, ధర్మాదాయ భూములు సాగు చేస్తున్న పేద కౌలు రైతులందరికీ బహిరంగ వేలం పాటలో లేకుండా మినిమం కౌలు వసూళ్లు చేయాలన్నారు. రాజధానికి భూములు ఇచ్చిన రైతులకు న్యాయం చేసే విధంగా అమరావతిని రాజధానిగా కొనసాగించా లన్నారు. స్థానిక సమస్యలపై సెప్టెంబర్ 25వ తేదీన అన్ని మండల కేంద్రాలలో జరగనున్న ధర్నాలో రైతులు, కౌలు రైతులు, వ్యవసాయ కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం తాడేపల్లి మండల నాయకులు దొంతి రెడ్డి వెంకటరెడ్డి, ఆంధ్రప్రదేశ్ కౌలు రైతు సంఘం తాడేపల్లి మండల కార్యదర్శి పల్లె కృష్ణ, ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం అధ్యక్ష కార్యదర్శులు పరిమిశెట్టి శివ నాగేశ్వరరావు, బత్తుల సంసోను, రైతు నాయకులు కాట్రగడ్డ శివన్నారాయణ , బొప్పన గోపాలరావు, వీరాస్వామి, షేక్ పాపా సాహెబ్, కౌలు రైతులు పల్లపాటి సుబ్బారావు, పోకల ఏడుకొండలు, పాల్గొన్నారు.


వడ్డేశ్వరం, చిర్రావూరులో వినతి పత్రాలు ఇస్తున్న జొన్నా శివశంకర్ తదితరులు

ప్రజాశక్తి - దుగ్గిరాల

సిసిఆర్‌సి కార్డు పొందిన ప్రతి కౌలు రైతుకు స్కేలాఫ్‌ఫైనాన్స్ ప్రకారం రుణాలు ఇవ్వాలని కౌలు రైతు సంఘం గుంటూరు జిల్లా ప్రధాన కార్యదర్శి బైరగాని శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. మండలంలోని చిలువూరు యూనియన్ బ్యాంకు వద్ద కౌలు రైతులకు రుణాలివావ్వలని నిర్వహించిన ధర్నాలో బైరగాని శ్రీనివాసరావు ప్రసంగించారు. కౌలు రైతుల సమస్యలు పరిష్కరించాలని 27న జిల్లా లీడ్ బ్యాంక్ వద్ద ధర్నా జరుగుతుందని కౌలు రైతులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. అనంతరం బ్యాంక్ మేనేజర్‌కి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో మండల కౌలు రైతు సంఘం అధ్యక్ష, కార్యదర్శులు బీమవరపు అమ్మిరెడ్డి, మన్నవ నాగమల్లేశ్వరావు, చిలువూరు గ్రామ అధ్యక్ష,కార్యదర్శులు బి కనకాంబరం, టి రామారావు, కె దావీదు, ప ప్రభాకరరావు తదితరులు పాల్గొన్నారు.


పొనుగుపాడులో వినతి పత్రం ఇస్తున్న మస్తాన్ వలి తదితరులు

ప్రజాశక్తి - ఫిరంగిపురం

ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం పొనుగుపాడు గ్రామ కమిటీ ఆధ్వర్యంలో గ్రామ రైతు భరోసా కేంద్రంలో రైతులకు, కౌలు రైతులకు రెండు లక్షల రూపాయలు వరకు రుణమాఫీ చేయాలని, భూ యజమానితో సంబంధం లేకుండా గుర్తింపు కార్డులు, బ్యాంకు రుణాలు సబ్సిడీలు అందించాలని తదితర సమస్యలు పరిష్కరించాలని రైతు భరోసా అధికారి గణేష్‌కి వినతి పత్రం ఇచ్చారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు భాస్కర్ రావు, కే విశ్వేశ్వరరావు, అప్పారావు, కే రాజశేఖర్, సిఐటియు నాయకులు ఎస్‌ఎం వలి తదితరులు పాల్గొన్నారు.


సదస్సులో ప్రసంగిస్తున్న వై.నేతాజీ

ముఠా వర్కర్లకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి-గుంటూరు : ముఠా వర్కర్ల సంక్షేమం కోసం సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని కోరుతూ జరిగే రాష్ట్రవ్యాప్త ఉద్యమంలో గుంటూరు జిల్లాలోని ముఠా వర్కర్లు అందరూ భాగస్వాములు కావాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి వై.నేతాజీ పిలుపు నిచ్చారు. గురువారం పాత గుంటూరు సిఐటియు కార్యాలయంలో షేక్ హుస్సేన్ వలి అధ్యక్షతన జరిగిన ముఠా వర్కర్స్ జిల్లా సదస్సులో నేతాజి మాట్లా డుతూ అసంఘటిత రంగంలో ముఠా వర్కర్లు పెద్ద సంఖ్యలో ఉన్నారని, వాణిజ్య, వ్యాపార రంగాల పనిలో కీలక పాత్ర పోషిస్తున్నారని తెలిపారు. సరుకుల ఎగుమతి దిగుమతి పనుల్లో నిరంతరం భాగస్వాములయ్యే ముఠావర్కర్లు పని చేయలేని పరిస్థితుల్లో దయనీయమైన జీవితాన్ని గడపాల్సి వస్తున్నదని అన్నారు. వీరిలో అత్యధిక మందికి ఏ చట్టాలు వర్తింపచేయట్లేదని, వివిధ రకాల మిల్లులలో పనిచేస్తున్న ముఠావర్కర్లకు కూడా యాజమాన్యాలు కార్మిక చట్టాలు అమలు చేయడం లేదని అన్నారు. షేక్ హుస్సేన్ వలి మాట్లాడుతూ జిల్లాలోని ముఠావర్కర్ల అందరిని ఐక్యం చేసి సమగ్ర చట్టం కోసం పోరాడాల్సిన అవసరం ఉందని అన్నారు. దాల్ మిల్లు వర్కర్స్ యూనియన్ నాయకులు వెంకటసుబ్బయ్య మాట్లాడుతూ యాంత్రీకరణ వల్ల ముఠావర్కర్లు తీవ్రంగా పనులు కోల్పోతున్నారని ఉన్న కార్మికులకు కూడా ప్రభుత్వం ఏ రకమైన సహకారం అందించకపోవడంతో దుర్భర జీవితం గడపాల్చి వస్తుందని అన్నారు. ఆసంఘటితంగా ఉన్న కార్మికులు అందరూ ఐక్యమై పోరాటాలు చేయడం ద్వారానే విజయం సాధించగలుగుతామన్నారు. సమావేశంలో జిల్లాలోని వివిధ మిల్లుల్లో పనిచేస్తున్న ముఠా కార్మికులకు ప్రావిడెంట్ ఫండ్ బోనస్సు ఈఎస్ఐ గ్రాట్యుటీ చట్టాలను అమలు చేయాలని, తెనాలిలో ఉన్న బెవరేజేస్ గోడౌను కొనసాగించి వందమంది కుటుంబాల జీవితాన్ని నిలబెట్టాలని కోరుతూ తీర్మానాలు ఆమోదించారు. ఈ కార్యక్రమంలో వివిధ ముఠాల నాయకులు కేఎస్ మల్లికార్జునరావు, చుక్కపల్లి శేషగిరిరావు, టీ కోటేశ్వరరావు పాల్గొన్నారు


రేవేంద్రపాడులో కాల్వగట్టుపై నివాసితులతో మాట్లాడుతున్న ఈమని అప్పారావు

ఇళ్లు తొలగిస్తే చూస్తూ ఊరుకోం : సిపిఎం

ప్రజాశక్తి - దుగ్గిరాల

కాల్వకట్టపై నివసిస్తున్న పేదల ఇళ్లను తొలగిస్తే సిపిఎం చూస్తూ ఊరుకోదని ఆపార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఈమని అప్పారావు హెచ్చరించారు. గురువారం రేవేంద్రపాడులో మద్రాస్ కాలువ గట్టుపై నివసిస్తున్న పేదలకు ఇరిగేషన్ డిపార్ట్‌మెంట్ అధికారులు ఇళ్లు తొలగించాలని ఇచ్చిన నోటీసులను పరిశీలించారు. ఈ సందర్భంగా అప్పారావు మాట్లాడుతు రాష్ట్ర ప్రభుత్వం పేదల ప్రభుత్వమని నిరంతరం జపిస్తుందని ఆచరణలో పేదలకు వ్యతిరేకమైన చర్యలు చేపడుతుందని విమర్శించారు. గత అనేక సంవత్సరాలుగా రేవేంద్రంపాడు కాలువగట్లపై సుమారు 250 కుటుంబాలవారు నివసిస్తున్నారని వారి ఇళ్లు తొలగిస్తామని ప్రభుత్వం నోటీసులు ఇవ్వడం సరైనది కాదని తెలిపారు. ఉన్న ఫలానా ఇల్లు ఖాళీ చేయమని నోటీసులు ఇస్తే పేదలు ఎలా బ్రతుకుతారని ప్రశ్నించారు. ఈ ప్రాంతంలో నివసిస్తున్న వారందరూ రోజువారీ పనులకు వెళ్తూ జీవనం కొనసాగిస్తున్నారని ఇక్కడ నివసిస్తున్న వారందరూ అసంఘటిత కార్మికులని వీరికి ఉన్న ఫలానా నోటీసులు జారీ చేయడం సరైనది కాదని తెలిపారు. ప్రభుత్వం ప్రత్యామ్నయం చూపించకుండా ఇల్లుకూల్చివేస్తే సిపిఎం చూస్తూ ఊరుకోదని ప్రజలందరినీ కలుపుకొని పోరాటం నిర్వహిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో సిపిఎం పార్టీ దుగ్గిరాల మండల కార్యదర్శి జెట్టి బాలరాజు, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

కందిపప్పు @ రూ.200



ప్రజాశక్తి-తాడేపల్లి

సామాన్య, మధ్యతరగతి పేదల కుటుంబాల్లో పప్పు ఉడకడంలేదు. కందిపప్పు ధర ఆకాశాన్నంటడమే దీనికి కారణం. మార్కెట్ మాయాజాలంలో కందిపప్పు ధర ప్రస్తుతం కిలో రూ.200 పలుకుతుంది. నిన్నటి దాకా టమాటా ధర కొండెక్కింది. ప్రస్తుతం కందిపప్పు ధర సగటు మనిషిని కలవరపెడుతుంది. వీటితో పాటు నిత్యావసరాల ధరలు చూసి 40 ఏళ్ల క్రితం ఓ ప్రజాకవి రాసినట్లు ఏం కొనేటట్టు లేదు... ఏం తినేటట్టు లేదు పాట గుర్తుస్తుంది. కందిపప్పు సరసన మినపప్పు ధర కూడా చేరింది.

రేషన్ షాపుల ద్వారా సరఫరా చేయాలి : సిపిఎం

కందిపప్పు, మినపప్పు ధరలు పెరగడం పట్ల సిపిఎం పట్టణ కమిటీ తరుపున కార్యదర్శి బూరుగ వెంకటేశ్వర్లు అసంతృప్తి వ్యక్తం చేశారు. పప్పులతో పాటు నూనెలు, తదితర 18 రకాల నిత్యావసర సరుకుల ధరలు రేషన్ షాపుల ద్వారా ప్రభుత్వం అందించాలని డిమాండ్ చేశారు.


జెసికి ఫ్యాన్లు అందజేస్తున్న బంగారు షాపుల యాజమాన్యాలు

ప్రభుత్వ హాస్టళ్లకు సీలింగ్ ఫ్యాన్లు అందజేత

ప్రజాశక్తి- గుంటూరు

కార్పోరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీలో భాగంగా ప్రభుత్వ హాస్టళ్లలో అమర్చేందుకు కళ్యాణ్ జ్యుయలర్స్ 11 గ్రెండర్లు , జోయాలుకాస్ 50 సీలింగ్ ఫ్యాన్లు, మలాబార్ గోల్డ్ యాజమాన్యం 64 సీలింగ్ ఫ్యాన్లను గురువారం కలెక్టరేట్ లో జరిగిన కార్యక్రమంలో సంయుక్త కలెక్టర్ జి. రాజకుమారికి అందించడం జరిగింది. ఈ సందర్భంగా సంయుక్త కలెక్టర్ జి. రాజ కుమారి మాట్లాడుతూ జిల్లాలోని హాస్టళ్ళలో మౌళిక వసతులు కలిపించేందుకు ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుంటున్నదని తెలిపారు. ప్రభుత్వం మాత్రమే కాకుండ కార్పోరేట్ సంస్థలు కూడా తమ సామాజిక బాధ్యతను గుర్తించి మౌళిక సదుపాయాల కల్పనలో తమవంతు సహాకారాన్ని అందించాలన్నారు. ఈ సందర్భంగా కళ్యాణి జ్యుయలర్స్ , జోయాలుకాస్ , మలాబార్ గోల్డ్ యాజమాన్యా లను జెసి అభినందించారు.ఈ కార్యక్రమంలో డిఆర్‌ఓ కె.చంద్రశేఖర్ రావు, లీగల్ మెట్రాలజీ డిప్యూటీ కంట్రోలర్ షాలెంరాజు, విభిన్న ప్రతిభావంతులు, సీనియర్ సిటీజన్ సహాయ శాఖ ఏ.డి సువార్త, అధికారులు పాల్గొన్నారు.

బాలకృష్ణ సినీ జీవితాన్ని విమర్శించడం తగదు

మంత్రి అంబటి తీరును ఖండించిన టిడిపి నేత మన్నవ

ప్రజాశక్తి - గుంటూరు

అమరావతిలో అసెంబ్లీ సాక్షిగా నందమూరి బాలకృష్ణ వృత్తిని అవమానిస్తూ అంబటి రాంబాబు వ్యవహరించడాన్ని టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి, ఎన్టీఆర్ ట్రస్ట్ డైరెక్టర్, గుంటూరు పశ్చిమ నియోజకవర్గ టిడిపి నాయకులు మన్నవ మోహన సాయి కృష్ణ తీవ్రంగా విమర్శించారు. గురువారం గుంటూరులో ఆయన మాట్లాడుతు బాలకృష్ణ భయపడే వ్యక్తి కాదని ఆయన మాట్లాడితే తట్టుకోలేక వైద్య పరీక్షలు చేయించుకోవాలని అంబటిని హెచ్చరించారు. అధికార దురహంకారంతో ఇష్టానుసారం మాట్లాడుతున్న వైసిపి నాయకులకు, అంబటి రాంబాబుకు రానున్న కాలం అన్నింటికీ సమాధానం చేబుతుందన్నారు. రాబోయే రోజుల్లో అందరి లెక్కలు సరిచేస్తామన్నారు. స్కిల్ డెవలప్‌మెంట్‌లో చంద్రబాబును అక్రమంగా అరెస్టు చేశారని ప్రజలకు అర్థమయ్యిందని, వారిలో తిరుబాటు మొదలయ్యిందని, వైసిపిని రాష్ట్రం నుండి తరిమి కొట్టే ందుకు అన్ని వర్గాల ప్రజలు ఎదురు చూస్తున్నారని మోహన్ కృష్ణ తెలిపారు.

మరణిస్తే.. మట్టి ఖర్చులకూ బతిమాలుకోవాలా?

- ఏళ్ల తరబడి సేవలు చేసి ఖాళీ చేతులతో ఇంటికి
- హామీని విస్మరించిన ముఖ్యమంత్రి
- చర్చలకు పిలుస్తామని మాటతప్పిన మంత్రి
- అంగన్వాడీల సమస్యలపై ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం
- అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్

ప్రజాశక్తి - పల్నాడు జిల్లా

అంగన్వాడిల సమస్యలు పరిష్కరించాలని ప్రభుత్వం దృష్టికి అనేకసార్లు తీసుకెళ్లామని, నిరసనలు ధర్నాలు చేశామని, అయినా ప్రభుత్వం నిర్లక్ష్య ధోరణి అవలంబిస్తోందని ఏపీ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) పల్నాడు జిల్లా ప్రధాన కార్యదర్శి జి.మల్లేశ్వరి విమర్శించారు. ఈ నేపథ్యంలో ఈనెల 25న చలో విజయవాడకు పిలుపునిచ్చినట్లు ప్రకటించారు. పల్నాడు జిల్లా కేంద్రమైన నరసరావుపేటలో స్థానిక కోటప్పకొండ రోడ్డులోని పల్నాడు విజ్ఞాన కేంద్రంలో గురువారం ఏపీ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా కమిటీ సమావేశం యూనియన్ జిల్లా అధ్యక్షురాలు కెపి మెటిల్డాదేవి అధ్యక్షత జరిగింది. మల్లీశ్వరి మాట్లాడుతూ ప్రస్తుతం జరుగుతున్న అసెంబ్లీ సమావేశాల్లో అంగన్వాడీల సమస్యలు పరిష్కరించే దిశగా చర్చలు జరపాలని, ఇప్పటికే ప్రజా ప్రతినిధులకు వినతి పత్రాలు ఇచ్చామని, చలో విజయవాడ ధర్నాకు సంబంధించి కూడా అధికారులకు వినతి పత్రాలు ఇచ్చామని వివరించారు. అంగన్వాడీలు పట్ల ప్రభుత్వాలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం



సమావేశంలో మాట్లాడుతున్న యనియన్ పల్నాడు జిల్లా ప్రధాన కార్యదర్శి మల్లీశ్వరి

చేశారు. తెలంగాణ రాష్ట్రం కంటే అదనంగా రూ.వెయ్యి వేతనం ఇస్తామని చెప్పిన జగన్‌మోహన్‌రెడ్డి అధికారం చేపట్టిన తర్వాత హామీని విస్మరించారని అన్నారు. గత అసెంబ్లీ సమావేశాల సమయంలో సంబందిత శాఖ మంత్రి యూనియన్ నాయకులను చర్చలకు పిలుస్తామని, సమస్యలు పరిష్కరిస్తామని చెప్పి పట్టించుకున్న దాఖలాలు లేవన్నారు. యాప్‌ల పేరిట వేధింపులు తట్టుకోలేక అనారోగ్యం బారిన పడుతున్నారన్నారు. అంగన్వాడీ మహిళలలో ఒంటరి మహిళలు అధికంగా ఉన్నారని, వీరిపై కుటుంబ భారం ఉంటుందని ప్రభుత్వం గ్రహించాలని కోరారు. సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం గ్రాట్యుటీ ఇవ్వాలన్నారు. మెటిల్డాదేవి మాట్లాడుతూ వైసిపి అధికారంలోకి వచ్చాక అంగన్వాడీలకు చేసిందేమి లేదన్నారు. యాప్‌లు, ముఖ హాజరు పనులను అంగన్వాడీలు వ్యతిరేకించడం లేదని, పని విధానాన్ని మాత్రమే వ్యతిరేకిస్తున్నామని చెప్పారు. 2017 నుండి పెండింగ్‌లో ఉన్న టిఎ బిల్లులు, 6 నెలల సెంటర్ అద్దెలు చెల్లించడంతోపాటు వేతనాలను సకాలంలో ఇవ్వాలన్నారు. జులైలో కలెక్టర్ కార్యాలయం వద్ద నిరసనలో జాయింట్ కలెక్టర్ ఇచ్చిన హామీలు కూడా అమలు కాలేదన్నారు. రిజిస్టర్ పుస్తకాలు పంపిణీ, అర్హులకు ప్రమోషన్లు తమ పరిధిలోని అంశాలని, వాటిని పరిష్కారానికి కృషి చేస్తానని జాయింట్ కలెక్టర్ హామీ ఇచ్చారని గుర్తు చేశారు. నాణ్యత లేని ఫోన్లలో ఇంటర్నెట్ కనెక్ట్ అవక పని భారం పెరిగిందని, మానసిక ఒత్తిడికి గురై అనారోగ్యం బారిన పడుతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. ఏళ్ల తరబడి సేవలు చేసి రిక్త హస్తాలతో ఇంటికి వెళుతున్నారని, రిటైర్మెంట్ బెనిఫిట్స్ దక్కడం లేదని చెప్పారు. అనారోగ్యంతో మృతి చెందితే మట్టి ఖర్చులు ఇవ్వాలని బతిమాలించుకోవాల్సి రావడం సిగ్గుచేట న్నారు. సెంటర్లలో చిన్నారుల ఆలనా పాలనా చూసే హెల్పెర్లకు అర్హతను బట్టి ప్రమోషన్లు కల్పించాలని, రాజకీయ జోక్యానికి తావివ్వొద్దని డిమాండ్ చేశారు. ఈ సమస్యలు పరిష్కారం అయ్యేదాక దశలవారీగా పోరాటం చేస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో నాయకులు ఎఎల్ ప్రసన్న కుమారి, ఎం.కవిత, నిర్మల, మంగమ్మ, సుజాత, ఎ.పద్మ పాల్గొన్నారు.

నేడు పెదకూరపాడులో జగనన్నకు చెబుదాం

ప్రజాశక్తి - పల్నాడు జిల్లా

'జగనన్నకు చెబుదాం' (స్పందన) కార్యక్రమాన్ని నియోజకవర్గ కేంద్రమైన పెదకూరపాడులో శుక్రవారం నిర్వహిస్తామని పల్నాడు జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పెదకూరపాడు జెడ్‌పి పాఠశాలలో మధ్యాహ్నం 2 గంటల నుండి కార్యక్రమం ఉంటుందని, అచ్చంపేట, అమరావతి, బెల్లంకొండ, క్రోసూరు, పెదకూరపాడు మండలాలలో ప్రజలు తమ సమస్యలను అధికారుల దృష్టికి తేవాలని సూచించారు.



చామర్రులో పారిశుధ్య పనులు

ప్రజాశక్తి-అచ్చంపేట

మండల కేంద్రమైన అచ్చంపేట పంచాయతీ పరిధిలోని చామర్రులో గురువారం పారిశుధ్య పనులు ప్రారంభించారు. పంచాయతీ కార్యదర్శి ఏవి సుబ్బారావు మాట్లాడుతూ పారిశుధ్య వారోత్సవాల్లో భాగంగా ఈనెల 15వ తేదీ నుండి గ్రామంలోని అన్ని వీధుల్లోనూ పనులు చేయిస్తామన్నారు. చెత్తను రోడ్లపై వేయకుండా పంచాయతీ పారిశుధ్య కార్మికులకు ఇవ్వాలని స్థానికులను కోరారు. మురుగు నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలన్నారు. పనులను కార్యదర్శితోపాటు మండల కో-ఆర్డినేటర్ (ఎంఎల్‌ఒ) ఆర్.ఆంజనేయులు పర్యవేక్షిస్తున్నారు.

స్వచ్ఛతపై విద్యార్థుల ర్యాలీ, ప్రతిజ్ఞ

ప్రజాశక్తి - వినుకొండ

మండలంలోని పెదకంచెర్ల పంచాయతి, గోనుగుంట్లవారిపాలెం పంచాయతీల్లో గురువారం విద్యార్థులతో 'స్వచ్ఛతా హీ సేవ' ప్రదర్శన, ప్రతిజ్ఞ చేయించారు. ఎంఆర్‌సి ప్రభాకర్‌రావు మాట్లాడుతూ గ్రామాన్ని దుర్గంధం నుండి దూరం చేయడం కర్తవ్యంగా అందరూ వ్యవహరించాలని సూచించారు. కార్యక్రమంలో స్వచ్ఛా భారత్ మిషన్ మండల రిసోర్స్ కో-ఆర్డినేటర్ పి.ప్రభాకర్‌రావు, పంచాయతీ కార్యదర్శి కె.మోహన్ చంద్, హెచ్‌ఎం శ్రీరాములు నాయక్, వీరాస్వామి, సంగీతరావు, విఆర్‌ఒ దేవమ్మ, ఉపాధ్యాయులు, ఆరోగ్య కార్యకర్తలు, ఆశాలు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాలపైన వైసిపి కన్ను : టిడిపి

ప్రజాశక్తి - పెదకూరపాడు

వచ్చే ఎన్నికల్లో ప్రజాస్వామ్య పద్ధతిలో గెలవడం కష్టమని వైసిపి నాయకులు భావిస్తున్నారని, అందుకే టిడిపి అనుకూరుల ఓట్ల తొలగింపు, పోలింగ్ కేంద్రాల మార్పుల ద్వారా లబ్ధి పొందాలని చూస్తున్నారని టిడిపి జిల్లా కార్యదర్శి ఎ.రమేష్ విమర్శించారు. ఈ మేరకు తహశీల్దార్‌కు గురువారం ఫిర్యాదు చేశారు. పోలింగ్ కేంద్రాలను వైసిపి నాయకులు వారి ప్రాంతాల్లోకి మార్చుకుంటున్నారని, పోలింగ్ రోజు వాటిని వారి ఆధీనంలోనికి తెచ్చుకునేందుకు కుటిలయత్నాలు చేస్తున్నారని ఆరోపించారు. లగడపాడు 153, పెదకూరపాడు 167, 168 జలాల్పురం 182, కంభంపాడు 184 పోలింగ్ కేంద్రాలను యథాతథంగా కొనసాగించాలని కోరారు. కార్యక్రమంలో బి.రాంగోపాల్రావు, వి.అప్పారావు, బి.ఆంజనేయులు, ఎం.సత్యం పాల్గొన్నారు.





ప్రైవేటు క్లాసులో విద్యార్థులు

కారంపూడి జెడ్‌పి పాఠశాలలో ఫీజులు

కామన్ ట్యూషన్ పేరుతో పదో తరగతి విద్యార్థి నుండి రూ.3 వేలు వసూలు

ప్రజాశక్తి - కారంపూడి

ఒక్క రూపాయి తీసుకోకుండా విద్యాబుద్ధులు నేర్పాల్సిన ప్రభుత్వ పాఠశాలలో ట్యూషన్ పేరుతో డబ్బులు వసూలు చేస్తున్నారు. వీటిని చెల్లించలేక పేదలైన విద్యార్థుల తల్లిదండ్రులు నానా అవస్థ పడుతున్నారు. ఉన్నత ప్రమాణాలతో కూడిన విద్యను అందిస్తున్నామని, కార్పొరేట్ పాఠశాలకు తీసిపోని విధంగా సదుపాయాలు, విద్యనందిస్తున్నామని ఒకవైపు ప్రభుత్వం ప్రకటిస్తుంటే మండల కేంద్రమైన కారంపూడి జెడ్‌పి పాఠశాలలో మాత్రం అందుకు భిన్నంగా పరిస్థితులు ఉన్నాయి. స్థానిక బ్రహ్మానాయుడు జిల్లా పరిషత్ హైస్కూల్‌లో పదో తరగతి విద్యార్థుల నుండి కామన్ ట్యూషన్ పేరుతో రూ.3 వేలు వసూలు చేస్తున్నట్లు తెలిసింది. పాఠశాల ముగిసిన తర్వాత ప్రత్యేక తరగతులు నిర్వహణ కోసం వీటిని వసూలు చేస్తున్నట్లు విద్యార్థులు చెబుతున్నారు. పదో తరగతిలో 75 మంది వరకూ ఉండగా ఒక్కొక్కరి వద్ద రూ.3 వేల చొప్పున తీసుకుంటున్నారు. దీనిపై హెచ్‌ఎంను వివరణ కోరగా నిజమేనని, అంగీకరించడంతోపాటు ఉపాధ్యాయులు ప్రత్యేకంగా చదువు చెబుతున్నారని, విద్యార్థుల్లో భయం, బాధ్యత పెంచడానికి తీసుకోవడం తప్పేమిటని ఎదురు ప్రశ్నించడం గమనార్హం. దీనిపై మండల విద్యాశాఖాధికారిని సంప్రదించగా డబ్బుల వసూలు విషయం తమ దృష్టికి రాలేదని, ఒకవేళ వసూలు చేస్తున్నట్లుయితే తప్పని చెప్పారు. దీనిపై విచారణ చేసి చర్యలు తీసుకుంటామన్నారు.

వికలాంగులకు కృత్రిమ అవయవాలు పంపిణీ

ప్రజాశక్తి - విజయపురిసౌత్



చేతన్ ఫౌండేషన్ (ఎన్నారై) సేవలు ఎనలేనివని మాచర్ల కెసిపి జనరల్ మేనేజర్ వెంకటరమణ అన్నారు. వాసవి క్లబ్ ఆఫ్ మాచర్ల చెన్నకేశవ, రోటరీ క్లబ్ మాచర్ల ఆధ్వర్యంలో చేతన ఫౌండేషన్ సహకారంతో వికలాంగులకు కృత్రిమ అవయాలు గురువారం పంపిణీ చేశారు. కార్యక్రమానికి పఠాన్ నాగూర్ వలి అధ్యక్షత వహించగా ఫౌండేషన్ చైర్మన్ వి.రవికుమార్ మాట్లాడుతూ ఫౌండేషన్‌ను ప్రారంభించి ఆరేళ్లయిందని, ఆంధ్ర తెలంగాణ ప్రాంతాల్లో సుమారు ఇప్పటివరకు రూ.10 కోట్లతో వికలాంగులకు కృత్రిమ అవయాలు, ట్రైసైకిళ్లు, పేద విద్యార్థులకు ల్యాప్‌టాప్‌లు, ఆర్థిక సాయం, మహిళలకు కుట్టు మిషన్లు, చిరు వ్యాపాలకు తోపుడు బండ్లు అందించినట్లు చెప్పారు. కార్యక్రమంలో అనిల్ కుమార్, పి.రంగారావు, డి.సాంబశివరావు, ఒ.చెన్నకేశవరావు, చిన్ని సత్యనారాయణ, పి.నరసింహారావు, షేక్ నాగుర్‌వలి, డాక్టర్ రామకోటయ్య, శ్రీనివాస్, వెంకటేశ్వరావు, సిహెచ్.సత్యనారాయణ, నాగేశ్వరావు, కె.శ్రీనివాసరావు పాల్గొన్నారు.



ఏడాదికే కుంగిన రోడ్డు

ప్రజాశక్తి-సత్తెనపల్లి

సత్తెనపల్లి పట్టణంలో ఏడాది కిందట గుంటూరు-మాచర్ల ప్రధాన రహదారి నిర్మాణ పనులు చేశారు. అయితే పట్టణ పరిధిలో డివైడర్‌కు రెండు వైపుల రోడ్డు కుంగిపోయింది. దీనివల్ల ద్విచక్ర వాహనాలు అదుపుతప్పి పడిపోయే ప్రమాదం ఉంది. వృద్ధులు నడిచేటప్పుడు సైతం కుంగిన భాగం సరిగా కనిపించక ఎదురు దెబ్బలు తింటున్నారు. సంబంధిత అధికారులు స్పందించి రోడ్డును సరిచేయాలని, నాణ్యతా ప్రమాణాలపై పరిశీలించాలని స్థానికులు కోరుతున్నారు.

నిర్మాణాల నాణ్యతపై పరిశీలన

ప్రజాశక్తి - రెంటచింతల

మండలంలోని వివిధ గ్రామాలలో రూ.3.09 కోట్లతో చేపట్టిన సిసి రోడ్లు, కమ్యూనిటీ హాల్, సచివాలయాలు, విలేస్ హెల్త్ క్లినిక్‌లు, పాలకేంద్రం, రైతు భరోసా కేంద్రాల నిర్మాణ నాణ్యతను ఇంజినీరింగ్ అధికారులైన ఏఈలు సుధాకర్‌రెడ్డి, వెంకటేశ్వరరెడ్డి బృందం గురువారం పరిశీలించింది. రెంటాల, పసర్లపాడు, గోలి, పాలువాయి, తుమృకోట, పాల్వాయి గేటు తదితర గ్రామాలను సందర్శించారు. వీరి వెంట మాజీ జెడ్‌పిటిసి ఎన్.భాస్కర్‌రెడ్డి, సర్పంచి మున్నా చంద్రం ఉన్నారు.



యూనిసెఫ్ సహకారంతో వర్సిటీలో ప్రత్యేక కోర్సు



ప్రజాశక్తి - ఎఎన్‌యు

ఆచార్యనాగార్జున యూనివర్సిటీలో యునిసెఫ్ సహకారంతో పాస్పోర్ట్ టు ఎర్నింగ్ (పి2ఇ) కార్యక్రమాన్ని గురువారం వర్సిటిలో బాలమోహన్‌దాస్ సెమినార్ హాలులో నిర్వహించారు. కార్యక్రమంలో బిసిడిఎ ఛైర్మన్ నేదురుపల్లి రామ్‌కుమార్, ఉన్నత విద్యా మండలి ఛైర్మన్ ఆచార్య హేమాచంద్రారెడ్డి ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభించిన అనంతరం నేదురుమల్లి రామ్‌కుమార్ మాట్లాడుతూ ఆంధ్ర ప్రదేశ్ యువతకు విలువైన విద్య నైపుణ్యాభివృద్ధి అవకాశాలను అందించేందుకు ఈ కార్యక్రమం రూపొందిం చినట్లు పేర్కొన్నారు. నిరంతరం అభివృద్ధి చెందుతున్న జాబ్ మార్కెట్లో విజయం సాధించడానికి అవసరమైన నైపుణ్యాలు అందించి వారిని శక్తివంతం చేయడానికి దోహదపడు తుందన్నారు. కొత్త ఆలోచనలతో, నూతన పథకాలతో ఏపీ దేశంలోని ఇతర రాష్ట్రాలకు రోల్ మోడల్‌గా నిలుస్తుంద న్నారు. విద్యార్థులు తరగతిగదిలో నేర్చుకునే పాఠాలతో పాటు సమాజంపై అవగాహన పెంచుకోవాలని సూచిం చారు. ఆచార్య హేమచంద్ర రెడ్డి మాట్లాడుతూ ఉన్నత విద్యలో నాణ్యతను పెంచడానికి మౌలిక సదుపాయాలు మెరుగుపరచి, నూతన ఆవిష్కరణ ప్రోత్సహించడానికి ఉన్నత విద్య మండలి చిత్తశుద్ధితో పనిచేస్తుందన్నారు. వేగంగా మారుతున్న ప్రపంచంలో రాణించటానికి అవసరమైన నైపుణ్యాలను పరిజ్ఞానంతో



విద్యార్థులను సమర్ధంతవంతులుగా చేయనున్నామని వివరించారు. అండర్ గ్రాడ్యుయేట్లు 10 నెలల తప్పనిసరిగా ఇంటర్నల్ షిఫ్ట్ చేయాలన్నారు. తెలంగాణ, ఆంధ్ర ప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాల చీఫ్ బిర్వాను తాఫెసే మాట్లాడుతూ యూనిసెఫ్ ప్రపంచ లక్ష్యాలను సమాజంలోకి తీసుకెళ్తున్నట్లు పేర్కొన్నారు. ప్రపంచంలో ప్రతి ఒక్కరు ఎదగాలని సంకల్పంతో యూనిసెఫ్ పనిచేస్తుందన్నారు. ఏపీతో కలిసి పనిచేయడం ఆనందాన్ని ఇస్తుందని వివరించారు. కార్యక్రమంలో వర్సిటీ బిసిడిఇ కోఆర్డినేటర్ ఆచార్య కె సునీత, అసిస్టెంట్ కోఆర్డినేటర్ విజయ్ కిషోర్, యూనిసెఫ్ కన్సల్టెంట్ డి సుదర్శన్, ఆచార్య ఎంఎల్ఎస్ దేవకుమార్, యూనిసెఫ్ ఎడ్యుకేషనల్ స్పెషలిస్ట్ శేషగిరి మధుసూదన్ తదితరులు పాల్గొన్నారు

పిఎఎల్‌పై ఉపాధ్యాయులకు రాష్ట్ర స్థాయి శిక్షణ

ప్రజాశక్తి-గుంటూరు

పాఠశాల విద్యాశాఖ ఆధ్వర్యంలో రూపొందించిన పర్సనల్ అడాప్టివ్ లెర్నింగ్ (పిఎఎల్) కార్యక్రమంపై రాష్ట్ర వ్యాప్తంగా ఎంపిక చేసిన ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులకు రెండ్రోజుల ఓరియెంటేషన్ కార్యక్రమం గురువారం ఏసీ కాలేజిలో ప్రారంభం అయ్యాయి. మొదటి రోజు ఉమ్మడి ప్రకాశం జిల్లా నుండి అనంతపురం వరకూ రాయలసీమ జిల్లాలకు చెందిన 30 పాఠశాలల పరిధిలోని ప్రధానోపాధ్యాయులతోపాటు, గణితం, సైన్స్ బోధిస్తున్న ఉపాధ్యాయులు, ఫీల్డ్ మేనేజ్‌మెంట్ సిబ్బందికి శిక్షణ ఇచ్చారు. శుక్రవారం ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా నుండి గుంటూరు జిల్లా పరిధిలోని మిగిలిన 30 పాఠాశాలలకూ శిక్షణ ఇవ్వనున్నారు. ఈసందర్భంగా ఓరియెంటేషన్ కార్యక్రమంలో పాల్గొన్న కన్వే జీనియస్ టీం ట్రైనర్లు హర్షదేవగుప్తుడు, రేష్మికుమార్, ఉజ్వల్, సౌరభ్, ప్రోగ్రామ్ మేనేజర్ రూపేష్‌కుమర్ విద్యాబోధనలో సాంకేతిక అంశాలపై శిక్షణ కల్పించారు. తరగతి గదిలో విద్యార్థులను అభ్యసనలో లీనమయ్యే విధంగా పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా శిక్షణ కల్పించారు. అదే విధంగా సెంటర్ స్క్వేర్ ఫౌండేషన్ ప్రతినిధులు, ప్రద్యోత్,



మాట్లాడుతున్న ట్రైనర్లు

అనిరుధ్‌తోపాటు, పాఠశాల విద్యాశాఖ ఐటి విభాగం ప్రతినిధులు రమేష్, వెంకట్రావు, సత్యం, పూర్ణచంద్రరావు, ఉర్దూ డిఐ ఖాసిం తదితరులు పాల్గొన్నారు.

కీటకజనిత వ్యాధులపై ఎగ్జిబిషన్

ప్రజాశక్తి-తెనాలిరూరల్

స్థానిక జేఎంజె కళాశాల గ్లోబల్ స్కూల్ ఆవరణలో గురువారం దోమలు వ్యాప్తి చెందకుండా తీసుకోవాల్సిన జాగ్రత్త చర్యలు పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు.



దోమలు అభివద్ధి చెందేప్రదేశాలు వాటిద్వారా సంక్రమించే వ్యాధులు ,తీసుకోవలసిన జాగ్రత్త చర్యలపై మున్సిపల్, మలేరియా శాఖలు సంయుక్తంగా విద్యార్థులకు ఎగ్జిబిషన్ స్టాల్స్ ఏర్పాటుచేశారు. ఈకార్యక్రమంలో మున్సిపల్ ఆరోగ్యాధికారిణి డాక్టర్ హెలెన్ నిర్మల మాట్లాడుతూ దోమల ద్వారా వ్యాపించే వ్యాధులపై తెనాలి పట్టణంలోని వివిధ ప్రాంతాలలో ప్రజలకు అవగాహన కలిగించుటకు ఈ ఎగ్జిబిషన్ స్టాల్స్ ని ఏర్పాటు చేస్తున్నామని పేర్కొన్నారు. చినరావూరు, సత్యనారాయణ పార్కు, రజకచెరువు పార్కునందు వాకర్స్ కు అవగాహన నిమిత్తం ఇదివరకే ఏర్పాటు చేశామని తెలిపారు. దోమయొక్క లార్వాలు దోమలుపెరిగే ప్రదేశాలు, గంభూసియచేపలు, దోమతెరలు యొక్క ప్రాముఖ్యత, తదితర అంశాలను ప్రత్యక్షంగా ప్రదర్శించి విద్యార్థులకు, స్కూల్ సిబ్బందికి అవగాహనకలిగించారు. తెనాలి సహాయ మలేరియా అధికారి చిరసాని ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ దోమకాటు వలన మలేరియా, డెంగ్యూ, చికెన్ గునియా, ఫైలేరియా, మెదడువాపు వ్యాధి తదితర వ్యాధులు వ్యాపిస్తాయని అన్నారు. ప్రజలు నీటి నిల్వలు లేకుండాచూసుకోవాలని సూచించారు. తెనాలి పట్టణ సబ్ యూనిట్ ఆఫీసర్ శ్రీకంఠ ఉమాకాంత్ మాట్లాడుతూ ఫ్రైడే డ్రై డే పాటించడం ద్వారా ఈ వ్యాధులను కొంతవరకు నియంత్రించవచ్చన్నారు. కార్యక్రమంలో యుఎల్ బి ఆరోగ్య విస్తరణాధికారి అందె బాలచంద్రమౌళి , జేఎంజె గ్లోబల్ స్కూల్ ప్రిన్సిపల్ సిస్టర్ మేరీస్, తెనాలి పట్టణ మలేరియా సబ్ యూనిట్ అధికారి శ్రీకంఠ ఉమాకాంత్, వంగల పున్నారెడ్డి ఆరోగ్య పర్యవేక్షకులు దీపాల శ్రీనివాసరావు, ఆరోగ్య కార్యకర్త నవీద్, భాషిద్ తదితరులు పాల్గొన్నారు

ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలని రాస్తారోకో

ప్రజాశక్తి - చేబ్రోలు

ప్రస్తుత పార్లమెంటు ప్రత్యేక సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టి చట్టబద్ధత కల్పించాలని డిమాండ్‌తో ఎంఆర్‌పిఎస్ ఆధ్వర్యంలో చేబ్రోలులో నిర్వహిస్తున్న దీక్షలు గురువారం 12వ రోజుకు చేరాయి. ఈ క్రమంలో బాబుజగ్జీవన్‌రామ్ సెంటర్‌లో ఎంఆర్‌పిఎస్ నాయకులు, కార్యకర్తలు రాస్తారోకో చేపట్టారు. రాస్తారోకోలో ఎంఆర్‌పిఎస్ నియోజకవర్గ నాయకులు మురికిపూడి హృదయరాజు మాదిగ , జిల్లా అధ్యక్షులు వేమూరు సుధీర్ మాట్లాడుతు మందకష్ణ మాదిగ నాయకత్వంలో 29 సంవత్సరాల నుండి మాదిగ జాతి ఎస్ సి రిజర్వేషన్ల వర్గీకరణ కోసం అలుపెరుగని పోరాటం చేస్తుంది అన్నారు. గత ఎన్నికల్లో బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లో వర్గీకరణ చేస్తామని హామీ ఇచ్చి అమలు చేయలేదన్నారు. ఈ 9 సంవత్సరాల పాలనలో వర్గీకరణ చేయకుండా మాదిగలను నమ్మించి మోసం చేస్తుందని బిజెపి ప్రభుత్వాన్ని దుయ్యబట్టారు. 1994లో ఎంఆర్పిఎస్ ప్రారంభిస్తే 1996 లోనే మొట్టమొదటిసారి ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణకు అనుకూలంగా బి జె పి మాట్లాడింది అన్నారు. మా వేదికలకు దగ్గరకు వచ్చి మా దీక్ష శిబిరాల దగ్గరకు వచ్చి వర్గీకరణకు కట్టుబడి మాట్లాడి ఇప్పుడు కనీస వర్గీకరణ గురించి మాట్లాడకుండా తొమ్మిది సంవత్సరాల నుంచి మాదిగలను మోసం చేస్తున్నారని అన్నారు. నమ్మించి మాదిగలను మోసం చేసినటువంటి ఈ బీజేపీ ప్రభుత్వానికి బుద్ధి చెప్పడం కోసం నిరసన కార్యక్రమాలను చేపట్టామన్నారు. మాదిగలుతోపాటు ఎస్ సి ఉప కులాలు కష్టాలు కన్నీళ్లు బాధలు ఆవేదన అన్ని ప్రభుత్వానికి తెలుసన్నారు. మాకు రిజర్వేషన్ ఫలాలు అందడం లేదని కూడా తెలుసు, కానీ ఏకపక్షంగా దోచుకుంటున్న వారికి భయపడి వర్గీకరణ చేయకుండా మాదిగలను నమ్మించి బిజెపి ప్రభుత్వం మోసం చేసిందని అన్నారు. రానున్న రోజుల్లో తెలంగాణలో బిజెపి ప్రభుత్వం రావడం కోసం అనేక శక్తులతో ప్రయత్నాలు చేస్తుందని అన్నారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ ఉద్యమం తరపున ఒకటే తెలియజేస్తున్నాము బిజెపి వర్గీకరణ చేయకుండా తెలంగాణలో ఏ విధంగా అధికారంలోకి వస్తుందో కూడా తెలియజేస్తున్నామని అన్నారు. కార్యక్రమంలో డేగల బాబు మాదిగ, నంబూరు తబిత మాదిగ, కరుణ మాదిగ, కె సుందరబాబు మాదిగ, కుమార్ మాదిగ, టి యేసుపాదం మాదిగ, ఎస్ సామేలు మాదిగ, జే పి మాదిగ, జి కిరణ్ మాదిగ పాల్గొన్నారు.





గొడవర్రులో రైతుల తో మాట్లాడుతున్న వ్యవసాయ శాఖ డిప్యూటీ ప్రాజెక్ట్ డైరెక్టర్

వరి పంటపై మందులేమీ పిచికారి చేయొద్దు

ప్రజాశక్తి - దుగ్గిరాల

వరి పంటపై సుడి దోమ తెగులు ఉధృతి తక్కువగా ఉన్నదని, ఎటువంటి మందులు పిచికారి చేయవద్దని వ్యవసాయ శాఖ డిప్యూటీ ప్రాజెక్టు డైరెక్టర్ రామాంజనేయులు అన్నారు. గురువాయం మండలంలోని గొడవరు గ్రామంలో వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ గుంటూరు వారి ఆధ్వర్యంలో వరి పంట సమగ్ర యాజమాన్య పద్ధతిపై రైతులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో వరి పంటను ఆశించే చీడపీడల నివారణకు మార్గాలు, ఎరువుల వాడకం, కలుపు నీటి తీరువా తదితర అంశాలపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఏడీ రాజ వంశీ ఏవో శిరీష పవన్ పాల్గొన్నారు.



వడ్డేశ్వరంలో చిరువ్యాపారికి టిఫిన్ బండి అందజేత

ప్రజాశక్తి - తాడేపల్లి రూరల్

ఎంటిఎంసి పరిధిలోని వడ్డేశ్వరం గ్రామానికి చెందిన కోట వెంకాయమ్మ అనే చిరు వ్యాపారికి గురువారం వైయస్సార్సిపి స్థానిక నాయకులు మంగళగిరి శాసనసభ్యులు ఆళ్ల రామకష్ణారెడ్డి ఆర్థిక సహకారంతో టిఫిన్ బండిని అంద జేశారు. అద్దె బండిపై జీవనం సాగిస్తున్న తనకు టిఫిన్ బండి అందజేయడం పట్ల చిరు వ్యాపారి వెంకాయమ్మ ఎమ్మెల్యే ఆర్కే, స్థానిక వైసీపీ నాయకులకు కతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైయస్సార్సిపి గ్రామ నాయకులు గొడవర్తి శ్రీనివాసరావు, షేక్ మీరాస, కే అమర్నాథ్ పాల్గొన్నారు.



ఆరోగ్య సురక్షను సద్వినియోగం చేసుకోండి

అసిస్టెంట్ కమిషనర్ లక్ష్మీపతిరావు

ప్రజాశక్తి - మంగళగిరి

మంగళగిరి గణపతినగర్ లోని ఇందిరా నగర్ యూపీ హెచీసి పరిధిలోని కొత్తపేటలో జగనన్న ఆరోగ్య సురక్ష సర్వేను గురువారం నగరపాలక సంస్థ అసిస్టెంట్ కమిషనర్ లక్ష్మీపతిరావు, హెల్త్ సెంటర్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ డాక్టర్ పీ అనూష తనిఖీ చేశారు. ఏఎన్ఎంలు ఏడు రకాల పరీక్షలు చేస్తున్నారా, క్యాంపుకు సంబంధించిన తేదీ వివరాలను తెలియజేస్తున్నారా, తదితర వివరాలను వారు ప్రజలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం అసిస్టెంట్ కమిషనర్ లక్ష్మీపతిరావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతి ఒక్కరు ఆరోగ్యంగా ఉండాలని ఉద్దేశంతో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని చేపట్టిందన్నారు. ఇంటింటికి సర్వే బృందం వచ్చి ఆరోగ్య సమస్యలను గుర్తిస్తారన్నారు. ఆరోగ్య సమస్యలు ఉన్నవారికి హెల్త్ సెంటర్ వద్ద అక్టోబర్ మూడో తేదీన జరిగే క్యాంపులో స్పెషలిస్టులచే వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు ఇవ్వడం జరుగుతుందన్నారు.ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో హెల్త్ సెంటర్ సూపర్వైజర్ జయలక్ష్మి, ఏఎన్ఎం ఏ జ్యోతి, ఆశా వర్కర్ రిహానా పాల్గొన్నారు.

నేడు మంగళగిరి నియోజవర్గ విస్తృత సమావేశం

హాజరు కానున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు

ప్రజాశక్తి -మంగళగిరి

సిపిఎం మంగళగిరి నియోజకవర్గ విస్తృత సమావేశం పట్టణంలోని రత్నాలచెరులోని సింహాద్రి శివారెడ్డి భవన్‌లో నిర్వహిస్తున్నామని సిపిఎం గుంటూరు జిల్లా కార్యదర్శి విర్గసభ్యులు ఎస్ఎస్ చంగయ్య గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశంలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు, కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్ బాబురావు, జిల్లా కార్యదర్శి పాశం రామారావు పాల్గొంటారని తెలిపారు. ఉదయం 11గంటలకు నిర్వహించే సమావేంలో ఆహ్వానితులందరూ హాజరు కావాలని చంగయ్య కోరారు.

ఎస్సై పోస్టుల తుది రాత పరీక్షకు ఉచిత శిక్షణ

ప్రజాశక్తి-గుంటూరు

రాష్ట్ర ప్రభుత్వం అక్టోబర్ 14, 15 తేదీల్లో నిర్వహిస్తున్న ఎస్సై పోస్టుల తుది రాత పరీక్షకు రామ్‌కీ ఫౌండేషన్ ఈనెల 27 నుండి ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు ఫౌండేషన్ అధ్యక్షులు ఎం.వి.రామిరెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రిలిమ్స్‌లో, ఫిజికల్ ఈవెంట్స్‌లో అర్హత పొంది, కనీసం 90 మార్కులు సాధించిన ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు, 100 మార్కులు సాధించిన బిసి, ఇబిసి అభ్యర్థులు, ఓపెన్ కేటగిరీలో 110 మార్కులు పొందిన అభ్యర్థులకు ఈశిక్షణకు అందిస్తామన్నారు. శ్యామ్ ఇన్‌స్టిట్యూట్ కాకినాడ పరవస్తు క్రియేటివ్ ఫౌండేషన్ హైదరాబాద్ వారి సంయుక్త సహకారంతో పకడ్బందీ ప్రణాళికలతో కూడిన శిక్షణ ప్రతి రోజూ, ప్రతివారం పరీక్షలు నిర్వహిస్తూ, ప్రతి ఒక్కరూ ఉద్యోగ అర్హత సాధించేలా అవసరమైన సబ్జెక్టులపై అనుభవజ్ఞులైన అధ్యాపకులతో వివరణాత్మక తరగతులు ఉంటాయన్నారు. శిక్షణతోపాటు ఉచిత వసతి, భోజన సదుపాయం కల్పిస్తామని, అభ్యర్థులు జిల్లాలోని తుళ్లూరు మండలం, పెదపరిమిలోని రామ్‌కి ఫౌండేషన్ నైపుణ్యశిక్షణ కేంద్రంలో రిపోర్ట్ చేయాలన్నారు. ఇతర వివరాలకు 9866777870 నంబరులో సంప్రదించాలని రామిరెడ్డి తెలిపారు.



తైక్వాండో పోటీల్లో విజ్ఞాన్ విద్యార్థుల సత్తా

ప్రజాశక్తి-గుంటూరు

వడ్లమూడిలోని విజ్ఞాన్స్ యూనివర్సిటీ విద్యార్థులు రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీల్లో సత్తా చాటారని వర్సిటీ వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ పీ.నాగభూషణ్ తెలిపారు. గురువారం ఆయా విద్యార్థులను వర్సిటీలో అభినందించారు. రేపల్లెలో నిర్వహించిన ఏపీ స్టేట్ 3వ తైక్వాండో చాంపియన్ షిప్‌లో తమ వర్సిటీ విద్యార్థులు 5 గోల్డ్ మెడల్స్, 8 సిల్వర్ మెడల్స్, 6 బ్రాంజ్ మెడల్స్ సాధించారని తెలిపారు. గోల్డ్ మెడల్స్ సాధించిన విద్యార్థులు అక్టోబర్ మొదటి వారంలో ఉత్తర ప్రదేశ్‌లోని నాసిక్‌లో జరగబోయే జాతీయస్థాయి తైక్వాండో ఛాంపియన్‌షిప్‌కు అర్హత సాధించారని వెల్లడించారు. అదే విధంగా యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ ఆఫ్ బాపట్ల జిల్లా నిర్వహించిన జిల్లా స్థాయి యోగాసన చాంపియన్‌షిప్‌లో రిథమిక్ యోగా పేయిర్, ఆర్టిస్టిక్ యోగ సోలో, ఆర్టిస్టిక్ యోగా పేయిర్ వంటి విభాగాల్లో తమ విద్యార్థులు పాల్గొని 10 మొదటి స్థానాలు, 3 ద్వితీయ స్థానాలు, 3 తతీయ స్థానాలు సాధించి సర్టిఫికెట్లను పొందారని వెల్లడించారు. మొదటి, రెండు, మూడు స్థానాల్లో నిలిచిన విద్యార్థులందరూ రాష్ట్రస్థాయి యోగాసన చాంపియన్‌షిప్ పోటీలకు కూడా అర్హత సాధించారని తెలియజేసారు. తైక్వాండోలో గోల్డ్ మెడల్స్ సాధించిన పీ.వీణ మాధురి, వై.గాయత్రి బాల, ఎండీ ఉస్మాన్ అయాజ్ చిస్ట్, ఎమ్.దినేష్ కుమార్, ఎస్‌కే ముజామ్మిల్‌ను వీసీ ప్రొఫెసర్ నాగభూషణ్, రిజిస్ట్రార్ డాక్టర్ ఎంఎస్ రఘునాథన్, తదితరులు అభినందించారు.

నీళ్లు లేకుండా నిమజ్జనం ఎలా..!?

వినాయకుడి విగ్రహాలకూ నీటికొరత

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్

వినాయక విగ్రహాల నిమజ్జనానికి నీటి కొరత ఏర్పడింది. వినాయక చవితిని పురస్కరించుకుని సత్తెనపల్లి నియోజకవర్గంలో ఉత్సవ కమిటీ నిర్వాహకులు విగ్రహాలను ఏర్పాటు చేశారు. వినాయకుని నిమజ్జనానికి సాగర్ కాల్వల్లో నీళ్ళు లేకపోవడంతో నిర్వాహకులు ఆందోళన చెందుతున్నారు. విగ్రహాలకు ఐదురోజుల పాటు పూజలు నిర్వహించి అనంతరం నీళ్ళలో నిమజ్జనం చేస్తారు. నియోజక వర్గంలోని వివిధ గ్రామాల్లో సుమారు 300 విగ్రహాలను ఏర్పాటు చేశారు. నీళ్లు లేకుండా నిమజ్జనం ఎలా చేయాలో నని నిర్వాహకులు తలలు పట్టుకుంటున్నారు. పెద్ద విగ్రహాలు క్రోసూరు, కస్తల, అమరావతి తదితర ప్రాంతాల్లో కృష్ణా నదిలో నిమజ్జనం చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. సుమారు 30 కిలోమీటర్ల దూరంలో ఉన్న నదిలో నిమజ్జనం చేయాలంటే ఖర్చు తో కూడుకున్న విషయం. ఐతే చిన్న విగ్రహాలు ఎలా తీసుకెళ్లాలో అర్థం కాక గ్రామస్తులు ఆందోళన చెందు తున్నారు. గతం లో కూడా ఇదే పరిస్థితి నెలకొందని, అయినప్ప టికీ అధి కారులు, ప్రభు త్వం సమస్యను ఈ ఏడాది కూడా పరిష్కరి ంచే చర్యలు చేపట్టలేదని విమర్శిస్తున్నారు.



నీళ్లు లేక వెలవెల పోతున్న సాగర్ కాల్వలు

డ్రాప్ అవుట్స్ లేకుండా చర్యలు

జిల్లా కలెక్టర్ వేణుగోపాల్ రెడ్డి

ప్రజాశక్తి- గుంటూరు



జిల్లాలో పాఠశాలల నుంచి డ్రాప్ అవుట్స్ అయిన విద్యార్థులందరినీ తిరిగి బడిలో చేర్పించి, గ్రాస్ ఎన్రోల్మెంట్ రేషియో నూరు శాతం ఉండేలా నిరంతరం పర్యవేక్షిస్తూ అవసరమైన చర్యలు పటిష్ట ప్రణాళిక ప్రకారం తీసుకుంటున్నట్లు జిల్లా కలెక్టర్ ఎం వేణుగోపాల్ రెడ్డి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డా.కె ఎస్ జవహర్ రెడ్డికి తెలిపారు. గురువారం రాష్ట్ర సచివాలయం నుంచి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె ఎస్ జవహర్ రెడ్డి అభివృద్ధి, సంక్షేమ పథకాలపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా కలెక్టర్లు, సంయుక్త కలెక్టర్లతో సమీక్ష నిర్వహించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టరేట్ నుంచి జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి, సంయుక్త కలెక్టర్ జి.రాజకుమారి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో క్లస్టర్లు వారీగా, సచివాలయాల వారీగా సర్వే నిర్వహించి, బడి బయట ఉన్న పిల్లలను పాఠశాలలో చేర్పించటంతో పాటు, డ్రాప్ అవుట్స్ అయిన పిల్లలను తిరిగి పాఠశాలలో చేర్పించటం జరుగుతుందన్నారు. పాఠశాలలో చేర్పించిన పిల్లలను నిరంతరం పర్యవేక్షిస్తూ తిరిగి వారు డ్రాప్ అవుట్స్ కాకుండా చర్యలు తీసుకుంటున్నామని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కి వివరించారు.సమావేశంలో డీఎంహెచ్ఓ డా. శ్రావణబాబు, డీఈఓ శైలజ, సీపీఓ శేషశ్రీ, ఐసీడీఎస్ పీడీ మనోరంజని, వ్యవసాయశాఖ అధికారి నున్న వెంకటేశ్వర్లు, హౌసింగ్ పీడీ వేణుగోపాల్ పాల్గొన్నారు.

గురజాడ సాహిత్యాన్ని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలి

ప్రజాశక్తి-గుంటూరు

గురజాడ అప్పారావు సాహిత్యాన్ని విస్తతంగా ప్రజల్లోకి తీసుకవెళ్ళాలని జాషువా విజ్ఞాన కేంద్రం మేనేజింగ్ ట్రస్టీ పాశం రామారావు అన్నారు. గురువారం బ్రాడీపే ఎటలోని జాషువా విజ్ఞాన కేంద్రంలో గురజాడ 161వ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రామారావు మాట్లా డుతూ 'దేశమును ప్రేమించుమన్నా- మంచియన్నది పెంచుమన్నా' అంటూ నాటి ప్రజానీకానికి దేశభక్తిని ప్రభోధిస్తు ప్రజల్ని చైతన్య పరిచార న్నారు. కులములన్నియు కూలిపోవును, మతములన్నియు మాని పోవును, జ్ఞానమొక్కటే నిలిచివెలుగునంటూ విద్యను ప్రోత్సహించారు. కుల, మత, ప్రాంతీయ తత్వాలకు వ్యతిరేకంగా, మహిళల అభ్యున్నతికి, మూఢనమ్మ కాలకు వ్యతిరేకంగా పోరాటాలు చేశారన్నారు. మహిళలు ఆర్థిక స్వాలంబన సాధించినప్పుడే విముక్తి సాధిస్తారని చరిత్రను తిరగరాస్తారని గురజాడ ఆనాడే చెప్పారని తెలిపారు. ఆయన ఆశయాలను లక్ష్యాలను నేటి తరం కొనసాగించాలని పిలుపు నిచ్చారు.జై ఆంధ్ర డెమొక్రటిక్ ఫ్రంట్ (జె.డి.యఫ్) కన్వీనర్ అవధానుల హరి మాట్లాడుతూ దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 77 సంవత్సరాలైనా నేటికి కుల వివక్ష, అంటరానితనం, దళితులపై దాడులు, మహిళలపై అత్యాచారాలు కొనసాగు తున్నాయ న్నారు. గురజాడ ఇలాంటి ఋగ్మతులకు వ్యతిరేకంగ పోరాడారని వారి సాహిత్యాన్ని విస్తతంగా ప్రజల్లోకి తీసుకు వెళ్ళాలని కోరారు. కార్యక్రమంలో వివిధ ప్రజాసంఘాల నాయకులు ఎస్.పద్మ, కె.నళీనీకాంత్, ఎమ్.కిరణ్, బి.ముత్యాలరావు, కె.సుధీర్, వై.కృష్ణకాంత్ పాల్గొన్నారు.

ప్రజాశక్తి-తాడేపల్లి

మహాకవి గురజాడ జయంతి తాడేపల్లి పట్టణంలో ఐద్వా ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి. అరవింద హైస్కూల్లో జరిగిన సభలో సాహితీ స్రవంతి రాష్ట్ర సహాయ కార్యదర్శి సత్యాజీ మాట్లాడుతూ మహాకవి గురజాడ తన రచనల ద్వారా ప్రజలను మేల్కొల్పారని చెప్పారు. తాడేపల్లి జిల్లా పరిషత్ హైస్కూల్లో జరిగిన కార్యక్రమంలో ఎపిడబ్ల్యుజెఎఫ్ నాయకులు ఒ.శాంతి, సత్యాజీ మాట్లాడారు. ఉండవల్లి సెంటర్ వంశీ అకాడమీ సభలో డివైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి జి.రామన్న మాట్లాడుతూ సమాజంలో ఉన్న దురాచారాలను ప్రజల దృష్టికి తెచ్చి, కన్యాశుల్కం నాటకాన్ని రచించి ప్రజల మెప్పు పొందారని చెప్పారు. రవీంద్ర భారతి హైస్కూల్లో జరగిన సభలో తాడేపల్లి మాజీ సర్పంచ్ దొంతిరెడ్డి శ్రీనివాసకుమారి మాట్లాడుతూ కన్యాశుల్కంలో గిరీశం లాంటి పాత్రలు నేడు మరీ ఎక్కువయ్యాయని ఆందోళన వ్యక్తం చేశారు. సుందరయ్య నగర్ ప్రగతి హైస్కూల్లో జరిగిన సభలో కరస్పాండెంట్ పి.గిరిజ మాట్లాడుతూ సమాజంలో పేదలపై నేటికీ వివక్ష, అంటరానితనం కొనసాగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సభలో ప్రిన్సిపల్ లక్ష్మీప్రసాద్, వృత్తి కళాకారుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు జగన్ ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు ప్రసాద్, కె.కరుణాకరరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - పెదనందిపాడు

తేళ్ళ నారాయణ విజ్ఞాన కేంద్రం లో గురజాడ చిత్రపటానికి అఖిలపక్ష రైతు సంఘం నాయకులు కుర్రా హరిబాబు, రైతు సంఘం నాయకులు నరిశెట్టి ఆచార్యులు, సిపిఎం నాయకులు డి రమేష్ బాబు తదితరులు చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

ప్రజాశక్తి-తెనాలిరూరల్ : పుత్తడి బొమ్మ దుర్గమ్మ నాటికను రచించిన గురజాడ అప్పారావు ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోతారని లూథరన్ ప్రైమరీ స్కూల్ ప్రధానోపాధ్యాయులు ఎంబి రఘునాథరావు అన్నారు. స్థానిక నాజరుపేట పాఠశాల ఆవరణలో సోమవారం ఏర్పాటు చేసిన గురజాడ వెంకట అప్పారావు జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు పి ప్రియదర్శిని, ఎం నాగలక్ష్మి, జె శశికళ, ఉష పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - మంగళగిరి రూరల్

మంగళగిరి మండలం కాజా గ్రామంలో గురజాడ అప్పారావు జయంతి సభలను నిర్వహించారు. ఐద్వా మహిళా సంఘం ఆధ్వర్యంలో గ్రామ ఎం పి పి స్కూల్, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల లలో నిర్వహించారు. గురజాడ అప్పారావు సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఐద్వా మండల కార్యదర్శి ఎస్. విజయ లక్ష్మి, ఎ. విజయ లక్ష్మి, ఎస్. సుమ, ఎస్. నిర్మల పాల్గొన్నారు.



గుంటూరు సిపిఎం జిల్లా కార్యాలయంలో మాట్లాడుతున్న పాశం రామారావు



కుంచనపల్లి అరవింద హైస్కూల్లో గురజాడ జయంతిసభలో మాట్లాడుతున్న సత్యాజీ



ఉండవల్లి సెంటర్ వంశీ అకాడమి సభలో మాట్లాడుతున్న జి రామన్న



తెనాలి నాజరుపేట లూథరన్ ప్రైమరీ పాఠశాలలో గురజాడ జయంతి వేడుకలు



పెదనందిపాడు తేళ్ల నారాయణ విజ్ఞాన కేంద్రంలో గురజాడ చిత్రపటానికి నివాళి



కాజలో